ప్రజాశక్తి

ఆదివారం 6 జూలై 2025

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

అదే నిర్లక్ష్యం.. మళ్లీ ప్రమాదం

◆ సింహగిరి తొలిపావంచా వద్ద కూలిన షెడ్ ◆ భక్తులకు తప్పిన ముప్పు

◆ గిరి ప్రదక్షిణ ఏర్పాట్లు ఇలాగైతే కష్టమే..



నాడు గోడ కూలిన ప్రదేశం



నేడు షెడ్ కూలిన ప్రదేశం

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో, వేపగుంట విలేకరి

రాష్ట్రంలో ప్రసిద్ధిగాంచిన శ్రీ వరాహలక్ష్మీ నృసింహ స్వామివారి కొండ వద్ద ఉత్సవ వేళల్లో చోటుచేసుకుంటున్న ప్రమాదాలు భక్తులను భయకంపితులను చేస్తున్నాయి. ఈ ఏడాది ఏప్రిల్ 30న అప్పన్న చందనోత్సవంలో నాసిరకం గోడ కూలి ఏడుగురు మృతి చెందిన ఘటనను మరువకముందే కొండ కింద తొలి పావంచా వద్ద గిరి ప్రదక్షిణ ఏర్పాట్లలో భాగంగా వేస్తున్న రేకుల షెడ్డు శనివారం కూలిపోయిన సంఘటన పనుల్లో నాణ్యతా ప్రమాణాల డొల్లతనాన్ని పట్టిచూపుతోంది. తాజాగా షెడ్డు కూలిన ప్రదేశం వద్ద పెద్దగా జనం లేకపోవడంతో పెనుముప్పే తప్పింది. దీంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ఒకవేళ ఇదే సంఘటన గిరి ప్రదక్షిణ రోజు జరిగితే బాధ్యత ఎవరు వహిస్తారని భక్తులు, స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

షెడ్డు కూలిపోవడం వెనుక..

పోల్స్ కింద కాంక్రీట్ వేయకపోవడంతో బరువు ఎక్కువై షెడ్డు కూలిపోయినట్టు అర్థమవుతోంది. ఆలయ ఇన్‌ఛార్జి ఇఒ త్రినాథరావు మాత్రం మరోరకంగా చెబుతున్నారు. ఎత్తుగా షెడ్లు వేయడానికి మనుషులైతే ఇబ్బంది అవుతుందని భావించి ప్రొక్లెనర్ వాడామని, అది స్తంభానికి తగిలి షెడ్ ఒరిగిపోయిందని ఆయన తెలిపారు. ప్రమాద విషయాన్ని కలెక్టర్‌కు తెలపగా పూర్తిగా షెడ్‌లను తొలగించి ఓపెన్‌గా ఉంచి క్రషర్ డస్ట్ వేయాలని సూచించారన్నారు. ఇటీవల బదిలీపై వచ్చిన దేవాలయ సిబ్బందికి గిరి ప్రదక్షిణ ఏర్పాట్లపై అవగాహన లేకపోవడమూ షెడ్డు కూలడానికి కారణమని కొందరు చెబుతున్నారు. సింహాచలం దేవస్థానంలో ఇంజినీరింగ్ సిబ్బంది చాలా కాలంగా అప్రమత్తంగా ఉండటం లేదని, అందుకే ఇటీవల వరుస ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని భక్తులు అంటున్నారు. ఇదిలా ఉండగా తాజా ఘటనపై జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తమై ఈ నెల 9, 10 తేదీల్లో జరుగబోయే సింహాచల గిరి ప్రదక్షిణ ఏర్పాట్ల విషయంలో కొండపై ఎలాంటి అవాంఛనీయ ఘటనలూ మిగతా 2లో..

సమన్వయం అవసరం

◆ గిరి ప్రదక్షిణ ఏర్పాట్ల సమీక్షలో కలెక్టర్ హరేంధిర ప్రసాద్

◆ గత అనుభవాలను మరిచిపోవొద్దు : ప్రజాప్రతినిధులు



ఏర్పాట్లపై సమీక్షిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామివారి దేవస్థానం ఆధ్వర్యంలో ఈ నెల 9, 10 తేదీల్లో నిర్వహించే సింహాచలం గిరి ప్రదక్షిణ కార్యక్రమాన్ని సమన్వయంతో విజయవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ అన్నారు. ఈ మేరకు కలెక్టరేట్ మీటింగు హాలులో శుక్రవారం జిల్లాకు చెందిన ప్రజా ప్రతినిధులు, అధికారులతో ఏర్పాట్లపై సమీక్షించారు. 5 నుంచి 6 లక్షల మంది భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున, ప్రతి 200 మీటర్లకు ఒకటి చొప్పున మొత్తం 132 తాగునీటి పాయింట్లు, 500 మరుగు దొడ్లు, ఆరు కంట్రోల్ రూములు, ఐదు చోట్ల పబ్లిక్ అడ్రస్ సిస్టమ్, 32 వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. 18 నెట్ వర్కింగ్ ఆసుపత్రులకు వాటిని అనుసంధానిస్తున్నట్టు తెలిపారు. నిరంతరాయంగా విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు చేపట్టామని చెప్పారు.

సమావేశంలో భాగస్వామ్యమైన ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణబాబు, విష్ణుకుమార్ రాజు, పంచకర్ల రమేష్ బాబు, వంశీకృష్ణ శ్రీనివాస్, విఎంఆర్‌డిఎ ఛైర్మన్ ప్రణవ్ గోపాల్, డిసిసిబి ఛైర్మన్ కోన తాతారావు, ఎపి ఆయిల్స్ అండ్ సీడ్స్ కార్పొరేషన్ ఛైర్మన్ గండి బాబ్జీ, ఇతర ప్రతినిధులు మాట్లాడుతూ భక్తులకు ఇబ్బంది లేకుండా పక్కా ఏర్పాట్లు చేయాలని సూచించారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. సింహాచలం మెట్ల మార్గంలో నాచు పట్టిందని, మార్గంలో మొక్కలు, చెట్ల కొమ్మలు పెరిగిపోయాయని చర్యలు తీసుకోవాలని అన్నారు. సాయినగర్ వద్ద బారికేడింగ్ పెట్టడం వల్ల ఆ ప్రాంత మిగతా 2లో..

మద్యం షాపు తొలగించాలని నిరసన

▶ వార్త 2లో..

10,136 కేసులు పరిష్కారం

▶ వార్త 2లో..

మెయిన్ స్కూల్ మూసివేసే కుట్ర ఆపాలి

▶ వార్త 5లో..

డ్రగ్స్ కేసులో ఇద్దరు అరెస్టు

◆ నిందితుల్లో ఒకరు దక్షిణాఫ్రికా వాసి

◆ 25 గ్రాముల కొకైన్, రూ.3.6 లక్షల నగదు స్వాధీనం



కొకైన్‌ను చూపుతున్న సిపి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : మూడో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో నిషేధిత సింథటిక్ లార్కోటిక్ డ్రగ్ విభాగానికి చెందిన కొకైన్‌ను విక్రయిస్తున్న ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. వారిలో ఒకరు విదేశీయుడు. కేసు వివరాలను నగర పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి తన కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వెల్లడించారు. డ్రగ్స్ విషయంలో ఈగల్, విశాఖపట్నం సిటీ పోలీసులు కొద్ది కాలంగా నిఘా పెట్టారు. 25 గ్రాముల కొకైన్ ఢిల్లీ నుంచి విమాన మార్గంలో విశాఖకు వస్తుందన్న సమాచారం మేరకు పట్టుకునేందుకు ప్రణాళికలు వేశారు. ఈ క్రమంలో దక్షిణాఫ్రికాకు చెందిన నిందితుడు థామస్ డిమాల్ విశాఖపట్నంలోని సీతమ్మధార ప్రాంతానికి చెందిన చెరుకూరి అక్షయ్య అలియాస్ మున్నాకు ఆంధ్ర యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల మైదానం దగ్గర కొకైన్ ఇచ్చి నగదు తీసుకుంటుండగా మాటు వేసి పట్టుకున్నారు. విచారణలో ఢిల్లీకి చెందిన బుచ్చి, దక్షిణాఫ్రికాకు మిగతా 2లో..



విశాఖ నగరంలో సాగుతున్న బైకు ర్యాలీ



అచ్యుతాపురంలో ప్రచార జాతాలో మాట్లాడుతున్న శంకరరావు

సార్వత్రిక సమ్మె.. ప్రభుత్వానికి హెచ్చరిక

◆ లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాల్సిందే

◆ విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో బైకు ర్యాలీ, ప్రచార జాతాలు

ఈ నెల 9న తలపెట్టిన జాతీయ సమ్మెను జయప్రదం చేయాలంటూ విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో శనివారం ప్రచారం హోరెత్తింది. కార్మిక వాడల్లో ప్రచార జాతాలు కలియదిరిగాయి. విశాఖ నగరంలో భారీ బైకు ర్యాలీ చేపట్టగా పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు. తమకు నష్టం చేకూర్చే లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాల్సిందేనని పెద్ద పెట్టున నినదించారు. (వార్తలు 8లో..)

మొదటి పేజీ తరువాయి..

అదే నిర్లక్ష్యం.. మళ్లీ ప్రమాదం

చోటుచేసుకోకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆలయ అధికారులను ఆదేశించింది.

సేవా సంస్థలకు దేవస్థానం షరతులు

ఏటా గిరి ప్రదర్శనకు విచ్చేసే లక్షల మంది భక్తులకు సేవా వితరణ చేపట్టే సంస్థలపై ఆలయ అధికారులు షరతులతో వేధించే చర్యలకు దిగారు. అన్న ప్రసాదాలు, మజ్జిగ, మంచినీరు, బిస్కట్లు ఇలా ఎవరికి తోచినవి వారు మార్గంమధ్యలో భక్తులకు ఇచ్చే ఆనవాయితీ తొలి నుంచీ ఉంది. ఇటీవల కొండపై జరుగుతున్న వరుస ఘటనల నేపథ్యంలో ఆలయ అధికారులు కొత్త షరతులను ముందుకు తెచ్చారు. సేవ కోసం వచ్చే సంస్థలు పోలీస్ వారికి 'బైండోవర్' హామీ పత్రం ఇవ్వాలని నిబంధన పెట్టారు. దీంతో సేవా సంస్థలు అవాక్కయ్యాయి. సంస్థలవారిచ్చే ఆహారం తిని ఎక్కడైనా భక్తులకు ఇబ్బంది ఏర్పడితే దానికి సంస్థలే బాధ్యత వహించాలన్న షరతును ఆ బైండోవర్ హామీ పత్రంలో పెట్టడంతో స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు అవాక్కయ్యారు. శనివారం వారంతా మీడియా ముందుకు రావడంతో నాలుక్కరుచుకుని సింహాచలం ఆలయ అధికారులు ఆ బైండోవర్ హామీ పత్రంపై ఒత్తిడి తగ్గించినట్లు తెలిసింది.

సమన్వయం అవసరం

ప్రజలకు ఇబ్బంది కలుగుతుందని, దారి ఉంచాలని పోలీసులకు సూచించారు.

9 మధ్యాహ్నం 2 గంటలకు ప్రచార రథం ప్రారంభం

సింహాచలం ఆలయ ఇఒ వేంద్ర త్రినాథరావు మాట్లాడుతూ 9వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు తొలిపావంచా వద్ద అనువంశిక ధర్మకర్త అశోక్ గజపతి చేతుల మీదుగా ప్రచార రథం ప్రారంభమవుతుందని తెలిపారు. ఆ రోజు రాత్రి 10 నుంచి 11 గంటల మధ్యలో రథం ఆలయానికి చేరుకుంటుందని, స్వామివారి పవళింపు సేవ, ఇతర లాంఛనాల అనంతరం ఉదయం 5 గంటల నుంచి స్వామివారి దర్శనాలు ప్రారంభమవుతాయన్నారు. 10వ తేదీ సాయంత్రం 4 గంటల వరకు దర్శనాలు కొనసాగుతాయని, 4 నుంచి 5.30 గంటల వరకు పవళింపు సేవ, తర్వాత 5.30 నుంచి 7 గంటల వరకు దర్శనాలు ఉంటాయని వివరించారు. సమావేశంలో దేవాదాయ శాఖ జెసి రామచంద్ర మోహన్, సిపి శంఖబ్రత బాగ్చీ, డిసిపిలు అజిత, మేరీ ప్రశాంతి, జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్ పాల్గొన్నారు.

డ్రగ్స్ కేసులో ఇద్దరు అరెస్టు

చెందిన ప్రిన్స్ ఒమెనెఫ్ ఈ డ్రగ్స్ వ్యవహారంలో భాగస్వాములుగా ఉన్నట్టు గుర్తించారు. వారి కోసం ఢిల్లీకి ప్రత్యేక బృందం వెళ్లనుందని సిపి తెలిపారు. తాజాగా పట్టుకున్న కొకైన్ మార్కెట్ ధర 10 - 15 లక్షల వరకూ ఉంటుందని వెల్లడించారు. నిందితుల నుంచి రూ.3.6 లక్షల నగదు, కారు, మూడు మొబైల్ ఫోన్లు, డైరీని స్వాధీనం చేసుకున్నామన్నారు. మీడియా సమావేశంలో ఈగల్ ఎస్‌పి నవీన్ కుమార్, ఇన్‌స్పెక్టర్ కల్యాణి, విశాఖపట్నం డిసిపి - 1 అజిత వేజెండ్ల, ఎసిపి లక్ష్మణమూర్తి, మూడో పట్టణ సిఐ పైడయ్య, ఎస్ఐ సురేష్ పాల్గొన్నారు.

మద్యం షాపు తొలగించాలని నిరసన

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఓల్డ్ టౌన్ మెయిన్ రోడ్డు శ్రీ కన్యకా పరమేశ్వరి దేవాలయం, ముస్లింల పంజాకు దగ్గరగా కురుపాం మార్కెట్ ప్రాంతంలో రెండు రోజుల క్రితం ఏర్పాటు చేసిన మద్యం షాపును తక్షణం తొలగించాలని డిమాండ్ చేస్తూ 38వ వార్డుకు చెందిన మహిళలు శనివారం షాపు వద్ద నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో పర్వీన్, అహ్మద్ తదితరులు పాల్గొన్నారు. విషయం తెలియడంతో 38వ వార్డు టిడిపి మాజీ కార్పొరేటర్ గోడే నరసింహచారితో పాటు మరి కొంతమంది వన్ టౌన్ స్టేషన్‌కు వెళ్లి సిఐకి ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు జోక్యం చేసుకొని మద్యం షాపును మూసి వేయించారు.

మై వెబ్ ఎక్స్‌పో ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ: మహిళల అభ్యున్నతికి వ్యాపార రంగంలో మహిళలను ప్రోత్సహించాలనే ఉద్దేశం తో బిందు సొసైటీ ఉమెన్ ఎంట్రప్రెన్యూర్ ఆధ్వర్యంలో విఎంఆర్డిఎ చిల్డ్రన్ ఎరీనా వేదికగా జూలై 5,6 తేదీల్లో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న మైవెబ్ ఎక్స్‌పో ఎగ్జిబిషన్‌ను శనివారం విఎంఆర్డిఎ ఛైర్మన్ ఎం.వి. ప్రణవ్‌గోపాల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులను అభినందించారు. ఎగ్జిబిషన్‌లో 60 పైగా స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు.

స్వల్పకాలిక నైపుణ్యాభివృద్ధి శిక్షణ ప్రారంభం

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ: రాష్ట్ర నైపుణ్యాభివద్ధి సంస్థ, నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ సంయుక్తంగా ఎస్‌సి కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఫ్రంట్ ఆఫీస్ అసోసియేట్ కోర్స్‌లో ప్రధానమంత్రి అనుశ్చిత్ జాతి అభ్యుదయ యోజన (పీఎం -ఎజెఎవై) పథకం కింద షెడ్యూల్డ్ కులానికి చెందిన యువతకు నిర్వహించనున్న స్వల్పకాలిక నైపుణ్యాభివృద్ధి ఉచిత శిక్షణ శనివారం గాజువాక పెదగంట్యాడలోని నాక్ శిక్షణా కేంద్రంలో ప్రారంభించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎస్‌సి కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఏం.సత్యపద్మ విద్యార్థులకు పుస్తకాలు అందజేశారు. తొలిరోజు శిక్షణకు 30 మంది హాజరయ్యారు. కార్యక్రమంలో నాక్ డైరెక్టర్ రవికుమార్, ఎస్‌సి కార్పొరేషన్ సిబ్బంది భాస్కర్ తదితరులు హాజరయ్యారు.

పంచాయతీ అభివృద్ధి సూచికపై అవగాహనా సదస్సు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : జెడ్‌పి సమావేశ మందిరంలో శనివారం పంచాయతీ అభివృద్ధి సూచికపై ఒకరోజు అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సుకు సిఇఒ పి.నారాయణ మూర్తి అధ్యక్షత వహించారు. కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలు, పంచాయతీ అభివృద్ధి సూచికలో పొందుపరిచిన 22 సూచికలు, ముఖ్యంగా, పిఎఐలోని 9 థీమ్‌లపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. డిపిఆర్‌సి ప్రిన్సిపాల్ నాగలక్ష్మి మాట్లాడుతూ, పంచాయతీ అభివృద్ధి సూచిక గురించి పూర్తిగా తెలుసుకోవాల్సిన అవసరముందన్నారు.

10,136 కేసులు పరిష్కారం

జాతీయ లోక్‌అదాలత్‌కు స్పందన

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ (విశాఖపట్నం) ఆధ్వర్యంలో ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో శనివారం జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించారు. దీనికి విశేష స్పందన లభించింది. 10,136 కేసులు పరిష్కారమయ్యాయి. కార్యక్రమంలో భాగంగా ఉమ్మడి విశాఖ జిల్లాలో 37 లోక్ అదాలత్ బెంచ్‌లను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు చిన్నంశెట్టి రాజు మాట్లాడుతూ కక్షిదారులకు లోక్ అదాలత్‌తో సత్వర న్యాయం జరుగుతుందని అన్నారు. విశాఖ జిల్లా కోర్టు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన లోక్ అదాలత్ బెంచిలను, కక్షిదారులకు అందుతున్న సదుపాయాలను ఆయన పరిశీలించారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో నిర్వహించిన లోక్ అదాలత్‌లో 10,136 కేసులు పరిష్కారమైనట్టు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శనివారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు. వీటిలో సివిల్ 291, క్రిమినల్ 9,713, ప్రీ లిటిగియేషన్ 132 కేసులు ఉన్నాయన్నారు. ఇన్ని కేసులను రాజీ చెయ్యడంతో ఉమ్మడి విశాఖ జిల్లా రాష్ట్రంలో రెండో స్థానంలో కొనసాగుతోందన్నారు. కేసుల రాజీ మొత్తం దాదాపు రూ.25 కోట్లు ఉంటుందన్నారు.

మిలీనియం క్యాంపస్ డ్రైవ్

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : మిలీనియం సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్‌లో శనివారం నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్ విజయం సాధించింది. ఈ డ్రైవ్‌లో 65 మంది విద్యార్థులకు చోటు లభించిందని మిలీనియం సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ సెంట్రల్ మేనేజర్ వరదా రవికుమార్ తెలిపారు. అప్లికేషన్ డెవలప్‌మెంట్ అండ్ డిప్లాయ్‌మెంట్ టెక్నాలజీలో ప్రముఖ కంపెనీల్లో ఒకటైన విశాఖపట్నంలోని మిరాకిల్ సాఫ్ట్‌వేర్ సిస్టమ్స్ యుఎస్ ఐటీ రిక్రూటర్, యుఎస్ ఐటీ బిజినెస్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ కోసం క్యాంపస్ డ్రైవ్ నిర్వహించబడింది. సుమారు 275 మంది విద్యార్థులు పాల్గొన్నారు. 65 మంది అభ్యర్థులు ప్లేస్‌మెంట్ పొందారు. కార్యక్రమంలో అసోసియేట్ డైరెక్టర్ ట్రైనింగ్ రాజా రమేష్, హెచ్‌ఆర్ సతీష్ పాల్గొన్నారు.

ప్రజలను మోసగిస్తున్న చంద్రబాబు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : చంద్రబాబు గారడీలో రాష్ట్ర ప్రజలు మరోసారి మోసపోయారని మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ ఆరోపించారు. 41 వ వార్డు జ్ఞానాపురానికి చెందిన అచ్చన్న కుమార్తె వాసుపల్లి వైష్ణవికి కళాశాల ఫీజు నిమిత్తం రూ.5 వేలు ఆర్థిక సాయం చేశారు. ఆశీలుమెట్ట కార్యాలయంలో శనివారం విద్యార్థిని తల్లిదండ్రులకు సొంత నిధులతో నగదును అందజేశారు.

రైల్వే సంబంధ సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : దక్షిణ నియోజకవర్గంలో రైల్వేకు సంబంధించిన పలు సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ కోరారు. శనివారం డిఆర్‌ఎం కార్యాలయంలో రైల్వే సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ సందీప్‌కు ఈ మేరకు వినతిపత్రం అందించారు. అధిక భక్తుల రద్దీ దష్ట్యా ఎర్నిమాంబ ఆలయానికి రైల్వేస్థలం కేటాయించాలని, పలుచోట్ల రైల్వే రక్షణ దళం ఏర్పాటు చేయాలని, పాత పోస్ట్‌ఆఫీస్ వద్ద అధునాతన సౌకర్యాలతో శాటిలైట్ స్టేషన్ ఏర్పాటు చేయాలన్నారు. జ్ఞానాపురం వద్ద ఫుట్‌బ్రిడ్జి ఏర్పాటు చేయాలన్నారు.చిలకపేట, పలు ప్రాంతాల్లో రక్షణ గోడలు నిర్మించాలన్నారు. రైల్వే కళ్యాణ మండపాలలో సామాన్యులకు అందుబాటు ధరలు ఉండేలా చూడాలన్నారు. పాత పోస్టాఫీసు ఏరియాలో నిరుపయోగంగా నున్న కాంకేర్ కంటైనర్ లోడింగ్ స్టేషన్‌ను అభివృద్ధి చేయాలన్నారు. దక్షిణ నియోజకవర్గంలో రైల్వే పరిసర ప్రాంతాలు నిరుపయోగంగా ఉన్నాయన్నారు. ఈ ప్రాంతంలో రైల్వే రక్షణదళం ఆర్‌పిఎఫ్, జి ఆర్‌పి సిబ్బందిని నియమించాలని కోరారు. రైల్వేఆస్థి చుట్టూ రక్షణగోడ పునర్నిర్మించవలసినదిగా కోరారు. ఎర్నిమాంబ దేవాలయానికి ఆనుకుని రైల్వేశాఖకు చెందిన కొంత స్థలమును విరాళంగా ఇవ్వాలని కోరారు.

ఫిషింగ్ బోటులో ట్రాన్స్ పాండర్స్ వినియోగించాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖపట్నం ఫిషింగ్ హార్బర్ నందుగల మెఖనైజ్డ్ ఫిషింగ్ బోట్లకు 100 శాతం సబ్సిడీపై ట్రాన్స్ పాండర్స్‌ను సరఫరా చేశామని, 634 బోట్లకు వీటిని అమర్చామని, తప్పనిసరిగా వినియోగించాలని మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ లక్ష్మణరావు ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ట్రాన్స్‌పాండర్ అనేది వైర్‌లెస్ కమ్యూనికేషన్ పరికరమని పేర్కొన్నారు.

మంచినీటి ట్యాంకులను క్లోరినేషన్ చేయాలి

ప్రజాశక్తి -పద్మనాభం : వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని మంచినీటి ట్యాంకులను తప్పనిసరిగా క్లోరినేషన్ చేయాలని పద్మనాభం ఎంపిపి రాంబాబు అధికారులను ఆదేశించారు. పద్మనాభం మండల సర్వసభ్య సమావేశం ఎంపిపి రాంబాబు అధ్యక్షతన శనివారం నిర్వహించారు. సమావేశంలో ముందుగా వ్యవసాయ శాఖపై వెంకటాచలం మాట్లాడుతూ, ఈ సంవత్సరం 1671 క్వింటాళ్లు వరి విత్తనాలను 16 రైతు భరోసా కేంద్రాలకు పంపించినట్లు తెలిపారు. పిల్లి పెసర వంటి పచ్చిరొట్ట ఎరువులు కూడా ఉంచినట్లు వివరించారు. 35 మంది రైతులకు 10 లక్షలు విలువ చేసే ఆధునిక వ్యవసాయ పరికరాలను అందించామన్నారు. అనంతరం రేవిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి లీలాప్రసాద్ మాట్లాడుతూ, ఈ నెల నుంచి పాఠశాలల విద్యార్థులకు రక్త పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఈ రక్త పరీక్షల వల్ల మలేరియా, డెంగీ తదితర వ్యాధులను గుర్తించవచ్చని తెలిపారు. గ్రామీణ తాగునీటి సరఫరా విభాగం ఎఇ హరీష్ మాట్లాడుతూ, మండలంలోని పలు గ్రామీణ ప్రాంతాల్లో నీటి సరఫరా పైపులైన్ పనులు 35 మంజూరయ్యాయని, 29 చోట్ల పనులు జరుగుతున్నాయని వివరించారు. దీనిపై గంధవరం సర్పంచ్ వివికె.వర్మ మాట్లాడుతూ, గంధవరం గ్రామంలోని పైప్ లైన్ పూర్తిగా మరో మత్తుకు గురయ్యాయని, కొత్త పైపులైన్లు వేయాలని కోరారు. విద్యుత్ శాఖపై ఎఇ జగన్మోహన్రావు మాట్లాడుతూ, కొన్ని గ్రామాల్లో వ్యవసాయ మోటార్లకు ప్రత్యేక లైన్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. దీనిపై వెంకటాపురం సర్పంచ్ కర్రి రమణ మాట్లాడుతూ, కొంతమంది రైతులకు సంబంధించిన వ్యవసాయ మోటార్ లైను విద్యుత్ స్తంభాలు రెండేళ్ల క్రితం పడిపోయాయని, వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని ఎన్నోసార్లు కోరినప్పటికీ అధికారులు స్పందించడంలేదని సభ దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై ఎంపిపి రాంబాబు స్పందిస్తూ ఒక సమావేశంలో వచ్చిన సమస్యను మళ్లీ సమావేశం నాటికి పరిష్కారం చేయాలని అధికారులను ఆదేశించారు. గంధవరం సర్పంచ్ జివివికె.వర్మరాజు మాట్లాడుతూ, ఎస్సి కాలనీలో ఒక ఇంటిపై విద్యుత్ లైను వేలాడుతూ ఉందని, వర్షాకాలంలో ఇంటికి షాక్ కొడుతుందని, పరిష్కార మార్గం చూడాలని కోరారు. విద్యా శాఖపై ఎంఇఒ పి.రమణ మాట్లాడుతూ, మండలంలోని 12 పాఠశాలలను మోడల్ పాఠశాలలుగా ప్రభుత్వం గుర్తించిందని, వీటిలో ప్రతి తరగతికీ ఒక ఉపాధ్యాయుని నియమించారని తెలిపారు. ఆయా పాఠశాలల్లో తప్పనిసరిగా విద్యార్థులను చేర్పించాలని కోరారు. పొట్లూరు గ్రామంలో ఉన్న ప్రాథమిక పాఠశాలలను జిల్లా పరిషత్ హైస్కూల్గా అప్గ్రేడ్ చేస్తున్నట్లు తెలిపారు. పద్మనాభం, రెడ్డిపల్లి, విజయానందపురంలోని పలు పాఠశాలలు రహదారి సమీపంలో ఉండటంతో స్కూల్ జోన్గా గుర్తించి స్పీడ్ బ్రేకర్లను వేయడానికి అనుమతులు తీసుకున్నామని తెలిపారు. ఉపాధి హామీ పథకం ఎపిఒ గౌరి మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామపంచాయతీల్లో ఉపాధి హామీ చట్టం పనులు జరుగుతున్నాయన్నారు. అటవీశాఖ ఆధ్వర్యాన ఉచితంగా నీలగిరి, సరుగుడు మొక్కలు పంపిణీ చేస్తున్నామని, అవసరమైన వారు ఆధార్ కార్డులు చూపించి తీసుకెళ్లవచ్చని చెప్పారు. పలు గ్రామ సచివాలయాల్లో పనిచేసిన గాయత్రీ, సువర్ణ, నాగమణి వేరే మండలాలకు బదిలీ కావడంతో మండల సమావేశంలో వారిని శనివారం సన్మానించారు. రేవిడి పిహెచ్సికి వైద్యులుగా ఎల్.ప్రసాద్, రెడ్డిపల్లి పశువైద్యాధికారిగా అనూష, హార్టికల్చర్ అధికారిగా వచ్చిన భానును కూడా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ ఎం.విజయ్కుమార్, ఇఆర్డి మీనాకుమారి, వైస్ ఎంపిపి ఏర్ల రాజేశ్వరి, సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు పాల్గొన్నారు.

పద్మనాభం మండల సమావేశంలో ఎంపిపి రాంబాబు



పద్మనాభం మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి రాంబాబు

నేరాలు ఘోరాలు

వేర్వేరు కేసుల్లో ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి-పెందుర్తి : జివిఎంసి 97వ వార్డు పరిధి చినముసిడివాడలో నివాసముంటున్న వైద్యులు ఇంట్లో పనిమనిషిగా చేరి దొంగతనానికి పాల్పడిన సత్యవతితో పాటు కొత్తవలస వద్ద బస్టాండ్లో పరుసు దొంగలించిన మరో మహిళను అరెస్టు చేసినట్లు వెస్ట్ క్రైమ్ ఎసిపి లక్ష్మణరావు తెలిపారు. పెందుర్తి పోలీస్స్టేషన్లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో క్రైమ్ సిఐ శ్రీనివాసరావు, ఎస్ఐ డి.సూరిబాబుతో వివరాలను మీడియాకు వివరించారు. కొత్తవలస మండలం మంగళపాలెంలోని గురుదేవ చారిటబుల్ ట్రస్ట్ ఆసుపత్రిలో పనిచేస్తున్న వైద్యుడు కుటుంబంతో కలిసి చిన్న ముషిడివాడలో నివాసముంటున్నారు. వారి వద్ద సత్యవతి పని మనిషిగా చేరారు. గత నెల 25వ తేదీ మధ్యాహ్నం మూడు గంటల సమయంలో విధులు ముగించుకుని ఇంటికి వచ్చి చూసిన వైద్యుడు బీరువాలో సామాన్లు చిందరవందరగాపడి ఉండడాన్ని గమనించారు. లాకర్లో చూడగా సుమారు 17 తులాలు బంగారం, రెండు లక్షల విలువైన డైమండ్లు కనిపించలేదు. పనిమనిషి సత్యవతిపై అనుమానం ఉన్నట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేపట్టారు. పని మనిషి సత్యవతి దొంగలించినట్లు నిర్ధారించి ఆమెను అదుపులోకి తీసుకున్నారు. చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు.

కొత్తవలస సమీపంలో బస్టాండ్ వద్ద పరుసు దొంగలించిన కేసులో మరో మహిళను అరెస్టు చేశామని, నిందితురాలి నుంచి సుమారు రూ.25 లక్షలు విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నామని ఎసిపి తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్కు తరలించినట్లు వెల్లడించారు. పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిసరాలలో అపరిచిత వ్యక్తులు పట్ల జాగ్రత్తగా ఉండాలని, పని మనుషులను నియమించుకునే ముందు వారి పూర్తి బయోడేటాను తెలుసుకోవాలని సూచించారు. ప్రతి ఇంటిలో సీసీ కెమెరా కచ్చితంగా ఏర్పాటుచేసుకోవాలని, సిసి కెమెరా ఉంటే పదిమంది పోలీసులతో సమానమని పేర్కొన్నారు.

వ్యభిచార గృహంపై పోలీసుల దాడి : ముగ్గురు అరెస్టు

ప్రజాశక్తి-పెందుర్తి : పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధి సుజాతనగర్ రత్నగిరినగర్ కాలనీలో ఒక ఇంటిని అద్దెకు తీసుకొని వ్యభిచారం సాగిస్తున్న ముఠాను పెందుర్తి పోలీసులు అరెస్టు చేశారు. బీసెట్టి ధనలక్ష్మి, ఆమె సహచరుడు వివేక్ తాము భార్యాభర్తలమని పేర్కొంటూ ఇంటిని అద్దెకు తీసుకున్నారు. మహిళలను అక్కడకు తీసుకొచ్చి వ్యభిచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు అందిన సమాచారంతో సిఐ కెవి.సతీష్కుమార్ ఆదేశాలతో పెందుర్తి పోలీసులు, సిటీ టాస్క్ ఫోర్స్ సిబ్బంది కలిసి దాడి చేశారు. ప్రధాన ముద్దాయిలైన బీసెట్టి ధనలక్ష్మి, వివేక్తో పాటు ఒక విటుడు, ఇద్దరు బాధిత మహిళలను అదుపులోకి తీసుకున్నారు. వారిపై చట్ట ప్రకారం తగు చర్య నిమిత్తం రిమాండ్ రిపోర్టుతో న్యాయస్థానానికి పంపినట్లు సిఐ సతీష్ కుమార్ తెలిపారు. బాధిత మహిళల రక్షణకు తగు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటిని ఎవరైనా అద్దెకు తీసుకుంటే, తప్పకుండా వారి ఆధార్ కార్డు వంటి గుర్తింపు పత్రాలు తీసుకోవాలని చెప్పారు. అద్దెదారుల చర్యలపై గమనిక ఉంచాలని, చట్టవ్యతిరేక కార్యకలాపాలు జరిగితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలకు సూచించారు. చట్ట విరుద్ధ కార్యకలాపాల కోసం ఉపయోగించిన ఇంటిని పూర్తిగా సీజ్ చేయవచ్చునని, కాబట్టి ఇంటి యజమానులు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. అసాంఘిక కార్యకలాపాలను ఎవరైనా గుర్తిస్తే 9440796039 నెంబరుకు సమాచారం ఇవ్వాలని కోరారు.

రెండు లారీలు ఢీ : డ్రైవర్‌కు గాయాలు

ప్రజాశక్తి - ఆనందపురం: ఆనందపురం మండలంలోని గుమ్మడివానిపాలెం వద్ద జాతీయ రహదారిపై శనివారం తెల్లవారుజామున రెండు లారీలు ఢీకున్నాయి. ఈ ఘటనలో ఒక లారీ డ్రైవర్కు స్వల్ప గాయాలయ్యాయి. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు నుంచి రొయ్యల లోడుతో ఆనందపురం వైపు వస్తున్న లారీ డ్రైవర్ గుమ్మడివానిపాలెం వద్ద టీ తాగేందుకు వాహనాన్ని ఒక పక్కకు ఆపాడు. అదే సమయంలో ఉల్లిపాయల లోడుతో వెళున్న మరో లారీ వెనుక నుంచి వచ్చి ఆగి ఉన్న రొయ్యల లారీని బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఉల్లిపాయల లారీ ముందు భాగం పూర్తిగా ధ్వంసమైంది. ఇందులో ఉన్న డ్రైవర్ స్వల్పంగా గాయపడగా, ఆయనను సమీపంలోని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఆనందపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

జైళ్ల ఆడిట్ కమిటీ చైర్మన్‌గా ఇండ్ల శ్రీనివాస్

ప్రజాశక్తి - ఆరిలోవ : జాతీయ స్థాయిలో జైళ్ల ఆడిట్ కమిటీ చైర్మన్గా ఆంధ్రప్రదేశ్ జైళ్ల శాఖ ఇన్స్పెక్టర్ జనరల్ (ఐజి)గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ ఇండ్ల శ్రీనివాస్ నియమితులయ్యారు. శనివారం ఆయన విశాఖ కేంద్రకారాగారాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా విలేకర్లతో మాట్లాడుతూ, జైళ్లలో నూతన సంస్కరణలు అమల్లో భాగంగా సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు కేంద్ర ప్రభుత్వం ఆడిట్ ఆఫ్ టెక్నాలజీ ఇన్ ప్రిజన్స్ కమిటీని ప్రత్యేకంగా నియమించినట్టు తెలిపారు. దీని ద్వారా జాతీయ స్థాయిలో అన్ని రాష్ట్రాల్లో కేంద్రకారాగారాలు, జిల్లా, సబ్ జైళ్లలో రక్షణ వ్యవస్థ పటిష్ఠంగా మారనున్నట్టు తెలిపారు. దేశంలో 25 రాష్ట్రాల్లోని కేంద్రకారాగారాలతో పాటు జిల్లా, సబ్ జైళ్లను కమిటీ సభ్యులు సందర్శించి, పరిశీలించాల్సి ఉందన్నారు. నెలలో ఐదు రోజులు 5 రాష్ట్రాలను పరిశీలిస్తామన్నారు. నివేదికను కేంద్రానికి అందజేయనున్నట్టు తెలిపారు.

పారిశుధ్య నిర్వహణపై దృష్టి

ప్రజాశక్తి -తగరపువలస : గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా పంచాయతీ అధికారి ఎం.శ్రీనివాసరావు సంబంధిత అధికారులకు సూచించారు. భీమిలి మండలం మూలకుద్దులో శనివారం పంచాయతీ కార్యదర్శి పి.రామారావుతో కలిసి పర్యటించారు. పారిశుధ్య నిర్వహణ, ఇంటింటా చెత్త సేకరణ అమలుపై గ్రామస్తుల నుంచి అభిప్రాయాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొయ్య రామకృష్ణారెడ్డి, రేఖవానిపాలెం పంచాయతీ కార్యదర్శి బి.గాయత్రి, పాల్గొన్నారు.



మూలకుద్దులో పర్యటిస్తున్న డిపిఒ శ్రీనివాసరావు

విమ్స్‌లో తలసేమియా వార్డు ప్రారంభం



విమ్స్‌లో తలసేమియా వార్డును ప్రారంభిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ఆరిలోవ : విమ్స్ ఆసుపత్రి ఆవరణలో నూతనంగా ఏర్పాటుచేసిన తల సేమియా వార్డును, సదరం సెంటర్, లిఫ్ట్, దివీస్ లేబొరేటరీ సహకారంతో ఏర్పాటుచేసిన మూడు ఆర్ఒ ప్లాంట్లను ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబుతో కలిసి ఎంపీ శ్రీభరత్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ, కెజిహెచ్ కంటే విమ్స్ ఆస్పత్రిలోనే రోగులకు సేవలందించేందుకు సామర్థ్యం ఎక్కువగా ఉందన్నారు. కెజిహెచ్ విస్తరణ పరంగా చాలా చిన్నదని, విమ్స్‌ను విస్తరించేందుకు స్థలం అందుబాటులో ఉందన్నారు. విమ్స్ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. విమ్స్ డైరెక్టర్ రాంబాబు విమ్స్ అభివృద్ధికి విశేషంగా కషి చేశారని కొనియాడారు. విమ్స్ ఆస్పత్రి విశాఖకే కాకుండా ఉత్తరాంధ్ర, గోదావరి జిల్లాల ప్రజలకు కూడా ఇక్కడ వైద్యం అందించే విధంగా అభివృద్ధి చేస్తామన్నారు. విమ్స్ అభివృద్ధిలో ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు విశేషంగా కృషి చేశారని తెలిపారు. నగరంలోని వికలాంగులకు సదరం పత్రాల జారీలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని డిఆర్సి మీటింగ్లో చర్చకు రావడంతో రాష్ట్ర ప్రభుత్వం స్పందించి విమ్స్ హాస్పిటల్లో 30 స్లాట్లతో సదరం క్యాంపును ఏర్పాటుచేసినట్లు తెలిపారు.

రూ.48 లక్షలతో 3 ఆర్ఒ ప్లాంట్లు

దివీస్ లేబొరేటరీ సామాజిక బాధ్యతలో భాగంగా రూ.48 లక్షలతో విమ్స్ హాస్పిటల్ ఆవరణంలో మూడు ఆర్వో ప్లాంట్లను ఏర్పాటు చేయటం అభినందనీయమని ఎంపీ శ్రీభరత్ పేర్కొన్నారు. ఏడాది కాలం పాటు ప్లాంట్ల నిర్వహణ బాధ్యతను కూడా వారే తీసుకోవడం హర్షించదగ్గ విషయం అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు, విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు, డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్ కుమార్, దివిస్ లేబొరేటరీ జనరల్ మేనేజర్ వైఎస్.కోటేశ్వరరావు, మేనేజర్ డి.సురేష్కుమార్, కార్పొరేటర్లు మద్దెల రామలక్ష్మి, కెల్ల సునీత తదితరులు పాల్గొన్నారు

బక్కన్నపాలెం పాఠశాల హైస్కూల్‌గా అప్‌గ్రేడ్

ప్రజాశక్తి-మధురవాడ : జివిఎంసి 6వ వార్డు పరిధిలోని బక్కన్నపాలెం ప్రాథమికోన్నత పాఠశాలను ఉన్నత పాఠశాలగా స్థాయి పెంచారు. ప్రస్తుత విద్యా సంవత్సరం (2025-26) నుంచి ఈ పాఠశాలలో 10వ తరగతి వరకు చదువుకునే అవకాశం దక్కింది. తాజా బదిలీల్లో ఉపాధ్యాయుల నియామక ప్రక్రియ సైతం పూర్తయింది. 1958లో ఏర్పడిన బక్కన్నపాలెం ప్రాథమిక పాఠశాల 2007-08లో ప్రాథమికొన్నత పాఠశాలగా మారింది. తాజాగా ఉన్నత పాఠశాలగా రూపు దిద్దుకుంది. ఇప్పటి వరకు బక్కన్నపాలెం ప్రాంతంలోని విద్యార్థులు మధురవాడ జాతీయ రహదారి పక్కనున్న చంద్రంపాలెం ఉన్నత పాఠశాలకు వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు బక్కన్నపాలెంలో హైస్కూల్ రావడంతో రేవళ్లపాలెం, లక్ష్మీవానిపాలెం, పిఎం.పాలెం, గాయత్రీనగర్, బీ-2 కాలనీ, కే-1, కే2 కాలనీ తదితర ప్రాంతాల విద్యార్థులకు అందుబాటులో ఉంటుంది.

మధురవాడ వాంబేకాలనీలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, చంద్రంపాలెం ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ఎన్నో ఏళ్ల తర్వాత ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు చొరవతో బక్కన్నపాలెం పాఠశాలను మూడో ఉన్నత పాఠశాలగా అందుబాటులోకి తెచ్చారు. 1 నుంచి 5వ తరగతి వరకు 111 మంది విద్యార్థులు, 6 నుంచి 9వ తరగతి వరకు 160 మంది విద్యార్థులు ఉన్నారు. ప్రధానోపాధ్యాయులతో పాటు 12 మంది ఉపాధ్యాయులు ఉన్నారు. వ్యాయామ ఉపాధ్యాయుడ్ని సైతం నియమించారు. 6 నుంచి 10వ తరగతి వరకు స్మార్ట్ టీవీల ద్వారా డిజిటల్ బోధన చేపడుతున్నారు. ఉన్నత పాఠశాలగా స్థాయి పెంచడంతో మరిన్ని సౌకర్యాలు కల్పించనున్నారు. ఇక్కడ అదనపు తరగతి గదులు, మరుగుదొడ్లను నిర్మించడంతో పాటు క్రీడా మైదానాన్ని అభివృద్ధి చేయాల్సిన అవసరముంది.

పెన్షనర్లకు కనీస పెన్షన్ అమలు చేయాలి

ప్రజాశక్తి -గాజువాక : పెన్షనర్లకు ప్రభుత్వం కనీస పెన్షన్ అమలు చేయాలని సిఐటియు నాయకులు ఎన్.రామారావు కోరారు. ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన శనివారం నడుపు హైస్కూల్లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్.రామారావు మాట్లాడుతూ, మినిమం పెన్షన్‌పై పదేళ్ల నుంచి పోరాటం చేస్తున్నా, దీనిపై సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినా ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు. పబ్లిక్ సెక్టార్లలో 30 నుంచి 35 ఏళ్ల పనిచేసిన కార్మికులకు చాలా అన్యాయం జరుగుతుందన్నారు. న్యాయమైన కనీస పెన్షన్ రూ.9000 ఇవ్వాలని కోరారు. భార్యాభర్తలకు మెడికల్ సౌకర్యం కల్పించాలని, ట్రైన్ ఛార్జీల్లో 50 శాతం రాయితీ, రైల్ కార్డు ఇవ్వాలని కోరారు. ఐఎన్‌టియుసి కార్యదర్శి మంత్రి రాజశేఖర్ మాట్లాడుతూ, భారతదేశంలో 78 లక్షల మంది పెన్షనర్లు ఉన్నారని తెలిపారు. పిఎఫ్ సొమ్ము వడ్డీ రూపంలో ప్రభుత్వానికి రూ.54 వేల కోట్లు జమవుతుందన్నారు. ఈ సమావేశంలో ఎగ్జిక్యూటివ్ అసోసియేషన్ నాయకులు బి.అప్పలస్వామి, పంతులు శీను, శంకర్ నారాయణ, అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కె.దీనబంధు, బెల్లం నాగేశ్వరరావు, నమ్మి అప్పలనాయుడు, నగేష్, బత్తిన వెంకటరావు, బి.గురప్ప, ప్రకాష్, బుడ్డి కృష్ణ, ఎన్‌వి.రమణ, శేసెట్టి అప్పారావు, నక్క అప్పారావు, డి.గురునాథ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్.రామారావు

విద్యుత్ సమస్యలపై 8 నుంచి సదస్సులు

ప్రజాశక్తి-సీతమ్మధార: ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ పరిధిలోని శ్రీకాకుళం, పార్వతీపురం, విశాఖపట్నం, తూర్పుగోదావరి, ఏలూరు సర్కిళ్ల విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 8వ తేదీ నుంచి సదస్సులు నిర్వహించనున్నట్లు విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక (సిజిఆర్ఎఫ్) చైర్మన్, విశ్రాంత జడ్జి బి.సత్యనారాయణ తెలిపారు. 8వ తేదీన శ్రీకాకుళం సర్కిల్ టెక్కలి సెక్షన్, పాలకొండ డివిజన్ వీరఘట్టం సెక్షన్‌లో, 17వ తేదీన విశాఖపట్నం జోన్-3 డివిజన్ పద్మనాభం సెక్షన్‌లో, 24వ తేదీన రాజమహేంద్రవరం రూరల్ డివిజన్‌లోని కడియం సెక్షన్‌లో, 27వ తేదీన జంగారెడ్డిగూడెం డివిజన్‌లోని జీలుగుమిల్లి సెక్షన్ కార్యాలయాల్లో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు జరిగే సదస్సుల్లో వినియోగదారులు నేరుగా పాల్గొని విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, హెచ్చుతగ్గులు, బిల్లుల సమస్యలు, కొత్త సర్వీసుల జారీలో జాప్యం, పేరుమార్పిడి, విద్యుత్ సరఫరా పునరుద్ధరణలో జాప్యం, ట్రాన్స్‌ఫార్మర్ల మార్పిడి తదితర సమస్యలపై ఫిర్యాదులను కమిటీకి తెలియజేయవచ్చని వివరించారు. సీతమ్మధారలోని ఏపీఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో ఉన్న సిజిఆర్ఎఫ్ కార్యాలయానికి కూడా నేరుగా గానీ, లిఖిత పూర్వకంగాగానీ ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. వినియోగదారులు విద్యుత్ సంబంధిత సమస్యల పరిష్కారం కోసం టోల్ ఫ్రీ నంబర్ 1912ను సంప్రదించాలని సూచించారు.

ఉచిత టైలరింగ్ శిక్షణ ప్రారంభం

ప్రజాశక్తి -ములగాడ : జివిఎంసి 62వ వార్డు పరిధి గుడివాడ అప్పన్న కాలనీలో మహిళలకు ఉచిత కుట్టు శిక్షణను స్థానిక ఎమ్మెల్యే గణబాబు ప్రారంభించారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యాన బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ సహకారంతో సుమారు 50 మందికి రెండు బ్యాచ్‌ల స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవతో మహిళలకు స్వయం ఉపాధి, నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇక్కడ శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్, కుట్టు మిషన్ ఇచ్చి స్వయం ఉపాధి కల్పించనున్నట్లు తెలిపారు. 61, 62, 63 వార్డులకు చెందిన మహిళలకు శిక్షణ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతరం శిక్షణార్థులకు టైలరింగ్‌కు అవసరమైన మెటీరియల్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో 62వ వార్డు టిడిపి అధ్యక్షులు మజ్జి మాలినాయుడు, ఎస్‌సి సెల్ అధికార ప్రతినిధి నీలాపు జోజి, నాయకులు చంద్రశేఖర్, నర్సింగారావు, శ్రీధర్, గంగాధర్, శ్రీను, కనకరాజు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి -ములగాడ : జివిఎంసి 62వ వార్డు పరిధి దుర్గానగర్ గ్రౌండ్‌లో వార్డు తెలుగుదేశం అధ్యక్షులు మజ్జి మాలినాయుడు ఆధ్వర్యాన శంకర్ ఫౌండేషన్ సహకారంతో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ప్రభుత్వ విప్ గణబాబు ప్రారంభించి మాట్లాడుతూ, నేత్ర వైద్య పరీక్షలు చేసి మందులు అందించడమే కాకుండా ఉచితంగా శస్త్ర చికిత్సలు చేస్తున్న శంకర్ ఫౌండేషన్ నిర్వాహకులను అభినందించారు.

కృత్రిమ మేధస్సుతో అద్భుతాల సృష్టి

ప్రజాశక్తి -ములగాడ : కృత్రిమ మేధస్సు భవిష్యత్తులో అద్భుతాలను సృష్టించనుందని సౌది అరేబియాలోని జజాన్ యూనివర్సిటీకి చెందిన సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ రాజకుమార్ మసీహ్ తెలిపారు. స్థానిక సెయింట్ ఆన్స్ డిగ్రీ కళాశాలలో 'మానవ, కృత్రిమ మేధస్సుల విప్లవాత్మక సహకారం' అనే అంశంపై ప్రత్యేక సదస్సు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మానవ మేధస్సుతో కలిసి కృత్రిమ మేధస్సు రాబోయే కాలంలో వివిధ వృత్తులలో పనితీరును మెరుగుపరుస్తుందని, తక్కువ సమయంలో ఖచ్చితమైన నిర్ణయాలు చేయడానికి ఉపయోగపడుతుందని తెలిపారు. మానవ తప్పిదాలను తగ్గిస్తుందన్నారు. ముఖ్యంగా వైద్యరంగంలో రోగ నిర్ధారణలో, ఆరోగ్య నివేదికల విశ్లేషణలో, కేన్సర్ వంటి జబ్బుల ముందస్తు హెచ్చరికల్లో ఇది కీలక పాత్ర వహించనున్నదని వివరించారు. సదస్సులో వైద్య నిపుణులు డాక్టర్ గ్లోరియా ప్రసంగించారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిస్టర్ ప్రేమ కుమారి అధ్యక్షతన జరిగిన సదస్సులో కరస్పాండెంట్ గెసిల్లా, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ క్యాస్లిన్, వై.ప్రేమలత పాల్గొన్నారు.

అనస్తీషియాకు ప్రత్యేక ప్రాధాన్యం

ప్రజాశక్తి-మధురవాడ : శస్త్రచికిత్సలు చేయించుకునే రోగులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మత్తు వైద్యులు ప్రధాన భూమిక పోషిస్తారని నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చీ అన్నారు. పిఎంపాలెంలోని వైజాగ్ కన్వెన్షన్లో రెండు రోజులు జరగనున్న ఇండియన్ సొసైటీ ఆఫ్ అనస్తీషియా (ఐఎస్ఎ) 34వ దక్షిణ మండల రాష్ట్ర వార్షిక సదస్సును శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ, వైద్య రంగంలో అనస్తీషియా ఎంతో ప్రాముఖ్యత కల్గిన విభాగమన్నారు.

స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలి : ఐద్వా



ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న మహిళలు

ప్రజాశక్తి -కరాస: ప్రజలకు నష్టం చేకూర్చే స్మార్ట్ మీటర్లను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని ఐద్వా నాయకులు అనురాధ, సుజాత పిలుపునిచ్చారు. జివిఎంసి 52వ వార్డు పరిధి శాంతినగర్ హస్మిభవన్‌లో ఐద్వా ఆధ్వర్యాన స్మార్ట్ మీటర్లు, కరెంటు బిల్లులు వంటి అంశాలపై మహిళలకు అవగాహన కల్పించారు. మహిళా సంఘం విశిష్టతను తెలియజేశారు. ప్రస్తుతం ధరలు విపరీతంగా పెరగడంతో పేద ప్రజలు సతమతమవుతున్నారని, ప్రజా సమస్యలపై పోరాటం చేసే వారికి మద్దతు ఇవ్వాలని కోరారు. అన్ని సంస్థలు ప్రైవేటీకరణ చేయడం వల్ల ఉపాధి లేక నిరుద్యోగం పెరుగుతుందన్నారు. ప్రభుత్వ సంస్థలు ఒక్కొక్కటిగా నిర్వీర్యం అవుతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. భారాలు పెంచే విద్యుత్ స్మార్ట్ మీటర్లను, ట్రూ అప్ చార్జీలను వ్యతిరేకించాలన్నారు. ఆదాని స్మార్ట్ మీటర్లు వల్ల భవిష్యత్తులో కరెంటు ఛార్జీలు విపరీతంగా పెరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిహెచ్.సుమిత్ర, మహిళలు పాల్గొన్నారు. అనంతరం స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ ప్లకార్డులను ప్రదర్శించారు.

నూతన కమిటీ

జివిఎంసి 52వ వార్డు కమిటీ అధ్యక్షులుగా కె.హేమలత, కార్యదర్శిగా లక్ష్మీదుర్గ, కమిటీ సభ్యులుగా హేమలత, ఆదిలక్ష్మి, మృదుల, గీత, జ్యోతి, ధనలక్ష్మి, ప్రమీల, జయలక్ష్మి ఎన్నికయ్యారు.

మెడికల్ షాప్ సీజ్

ప్రజాశక్తి -గోపాలపట్నం : గోపాలపట్నంలోని సాయి తేజస్వని మెడికల్ షాప్‌లో మత్తు కలిగించే టాబ్లెట్లను డాక్టర్ చీటీ లేకుండా అమ్ముతున్నారని సిటీ టాస్క్‌ఫోర్స్ సిబ్బందికి వచ్చిన సమాచారంతో డ్రగ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావుతో కలిసి ఉమ్మడి తనిఖీ నిర్వహించారు. డెకాయ్ ఆపరేషన్ ద్వారా ఈ విషయాన్ని నిర్ధారించుకున్న అధికారులు దుకాణంలో ఉన్న మందులు సీజ్ చేసి, దుకాణదారుని లైసెన్స్ సస్పెండ్ చేశారు.

మందుబాబులకు జరిమానా

ప్రజాశక్తి - ఆనందపురం : ఆనందపురం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం తాగి వాహనాలు నడిపిన 38 మందికి భీమిలి 15వ అదనపు మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి పి.స్వాతిభవానీ ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున జరిమానా విధించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్ఐ పాపారావు మాట్లాడుతూ, మద్యం తాడి వాహనాలు నడుపుతూ ఇతరుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ప్రవర్తన కొనసాగితే మరింత కఠినమైన శిక్షలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు.

మన గ్రోమోర్ సెంటర్ ప్రారంభం

ప్రజాశక్తి -పద్మనాభం : పద్మనాభం జంక్షన్‌లోని నాయుడు కాంప్లెక్స్‌లో మన గ్రోమోర్ సెంటర్‌ను ఎంపిపి కె.రాంబాబు, జడ్‌పిటిసి సభ్యులు ఎస్.గిరిబాబు, స్థానిక ఎంపిటిసి సభ్యులు లక్ష్మి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ, మండల స్థాయి గ్రోమోర్ సెంటర్‌ను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రైతులకు సరసమైన ధరలకు నాణ్యమైన సరుకులు ఇవ్వాలని అక్కడి సిబ్బందిని కోరారు. ఈ కార్యక్రమంలో భీమిలి ఎడిఎ ఎ.విజయప్రసాద్, మండల వ్యవసాయ శాఖాధికారి వెంకటాచలం తదితరులు పాల్గొన్నారు.

పివిఎన్.మాధవ్‌కు అభినందనలు

ప్రజాశక్తి-సీతమ్మధార : బిజెపి రాష్ట్ర అధ్యక్షులుగా నియమితులైన పివిఎన్.మాధవ్‌కు శనివారం పోర్టు స్టేడియంలో ఆత్మీయ అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా విశాఖ ఎంపి శ్రీభరత్, అనకాపల్లి ఎంపి సిఎం.రమేష్ మాట్లాడుతూ, పివి చలపతిరావు కుమారుడిగా తనకంటూ రాష్ట్ర రాజకీయాల్లో ప్రత్యేకమైన స్థానం మాధవ్ సంపాదించుకున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు పంచకర్ల రమేష్‌బాబు, బండారు సత్యనారాయణమూర్తి, గణబాబు, వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్, విష్ణు కుమార్‌రాజు, పల్లా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణ బాబు, విశ్వనాథ స్పోర్ట్స్ క్లబ్ అధినేత బొడ్డేటి కాశీ విశ్వనాథం, పరశురామరాజు పాల్గొన్నారు.

గంగవరం పోర్టు కాలుష్యంపై వినతి

ప్రజాశక్తి -గాజువాక : గంగవరం పోర్టు కాలుష్యం నివారించాలని కోరుతూ 76వ వార్డు కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు ఆధ్వర్యాన పోరాట కమిటీ నాయకులు గంగవరం పోర్టు యాజమాన్యానికి పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పోర్టు యాజమాన్యానికి సమస్యలను కార్పొరేటర్ శ్రీనివాసరావు, పోరాట కమిటీ సభ్యులు మంత్రి శంకర్‌నారాయణ, రంబ నారాయణమూర్తి, రౌతు గోవిందరావు వివరించారు. పోర్టు కాలుష్యం వల్ల 76, 75, 64, 73, 72 ,71 వార్డుల ప్రజలు తీవ్ర అనారోగ్యాలకు గురవుతున్నారని తెలిపారు. ఊపిరితిత్తులు, చర్మ కేన్సర్ తదితర వ్యాధులకు గురయ్యారని వివరించారు. గతంలో అనేకసార్లు పోర్టు యాజమాన్యం దృష్టికి తీసుకొచ్చామని అయినా యాజమాన్యం పూర్తి నిర్లక్ష్య వైఖరితో వ్యవహరిస్తోందని విమర్శించారు. గంగవరం పోర్టు నుంచి జగ్గు జంక్షన్ వరకు వస్తున్న భారీ వాహనాలకు, తార్పాన్లు వేసి బయటకు పంపించాలని, ఈ రోడ్డు మార్గాన్ని ప్రతిరోజూ నీటితో తడిపి, సిబ్బందితో ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని కోరారు. ఈ ప్రాంతంలోని ఏదో ఒక గ్రామంలో రోజూ మెడికల్ క్యాంపులు పెట్టి, ప్రజలకు వైద్య సౌకర్యం అందించాలని, ఆక్సిజన్ మొక్కలు వేయాలని కోరారు. దుమ్ము ధూళి ఇబ్బందులను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేకుంటే పోరాట కమిటీ ఆధ్వర్యాన పోరాటం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. వినతిపత్రం అందించిన వారిలో రామచంద్రనగర్ అధ్యక్ష కార్యదర్శులు డి.రమణ, నారాయణరావు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.



పోర్టు యాజమాన్యానికి వినతిపత్రం అందిస్తున్న పోరాట కమిటీ నాయకులు

రైల్వే వ్యాగన్ రిపేర్ వర్కర్స్ యూనియన్ కమిటీ ఎన్నిక



సమావేశంలో మాట్లాడుతున్న ఎం.రాంబాబు

ప్రజాశక్తి-గాజువాక : గాజువాక ఆటోనగర్‌లోని రైల్వే వ్యాగన్ రిపేర్ వర్కర్స్ (సిఐటియు) జనరల్ బాడీ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీని ఎన్నుకున్నారు. రైల్వే వ్యాగన్ రిపేర్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులుగా కె.అవతారం, కార్యదర్శిగా వైవి.రాజు, ట్రెజరర్‌గా రామకృష్ణ, ఉపాధ్యక్షులుగా సురేష్, సతీష్, సహాయ కార్యదర్శిగా కన్నారావు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా యూనియన్ గౌరవాధ్యక్షులు ఎం.రాంబాబు మాట్లాడుతూ, కార్మికుల సమస్యలపై ఈ నెల 9వ తేదీన నిర్వహించే సమ్మెను జయప్రదంచేయాలని పిలుపునిచ్చారు.

దేశ వ్యాప్త కార్మిక సమ్మెకు మద్దతుగా నిరసనలు

సంయుక్త కిసాన్ మోర్చా రౌండ్ టేబుల్ సమావేశంలో పిలుపు

ప్రజాశక్తి-అనకాపల్లి

లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని, కార్మిక, కర్షకుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 9న జరుగు దేశ వ్యాప్త సమ్మెకు మద్దతుగా జిల్లా, మండల కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని రైతులు, వ్యవసాయ కార్మికులకు సంయుక్త కిసాన్ మోర్చా పిలుపునిచ్చింది. ఈ మేరకు సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యాన రైతు సంఘాల ప్రతినిధులతో శనివారం అనకాపల్లిలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. దీనికి అధ్యక్షత వహించిన ఏపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా అన్ని కార్మిక సంఘాలు ప్రభుత్వ రంగాన్ని కాపాడాలని, లేబర్ చట్టాల్ని తిరిగి పునరుద్ధరించాలని, ఎనిమిది గంటల పని విధానం కొనసాగించాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సమ్మె చేస్తున్నట్లు చెప్పారు. సమ్మెకు మద్దతుగా రైతు, కౌలు రైతు సంఘాలు, వ్యవసాయ కార్మిక సంఘాలు సమ్మెలో పాల్గొంటున్నట్లు తెలిపారు. గిట్టుబాటు ధర చట్టం పార్లమెంటులో చేయాలని, విద్యుత్ సంస్కరణ బిల్లు ఆపాలని, స్మార్ట్ మీటర్లు బిగించరాదని, వ్యవసాయ కూలీలకు ఉపాధి బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌కెఎం రాష్ట్ర నాయకులు గాడి బాలు, రైతు సంఘం నాయకులు కోరిబిల్లి శంకరరావు, కాసుబాబు, కాళ్ల తేలయ్య బాబు, ఏఐటియుసి నాయకులు వైఎన్ భద్రం, రైతులు కార్మికుల పాల్గొన్నారు.



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న రైతు నేత కర్రి అప్పారావు



స్పోర్ట్స్ హబ్ ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

ఐకాన్ స్పోర్ట్స్ హబ్ ప్రారంభం

ప్రజాశక్తి-పరవాడ : పరవాడ మండలం చింతల గోర్లివానిపాలెం గ్రామంలో ఐకాన్ స్పోర్ట్స్ హబ్‌ను శనివారం ఆ సంస్థ ప్రతినిధులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఐకాన్ సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ ఇక్కడి యువత క్రీడల కోసం సిటీ వరకు వెళ్ళవలసి వస్తుందని, వారికి ఆ ఇబ్బంది లేకుండా తమ ఐకాన్ స్పోర్ట్స్ హబ్ అధునాతన హంగులతో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇందులో క్రికెట్, పికిల్ బాల్, బ్యాడ్మింటన్, మార్షల్ ఆర్ట్ వంటి క్రీడలు అందుబాటులోకి తెచ్చామని చెప్పారు. ఆటవిడుపుడు కోసం ఆన్లైన్, ఆఫ్‌లైన్ బుకింగ్ సదుపాయం ఉందన్నారు. నైపుణ్యం గల వారితో శిక్షణ ఇప్పించే సదుపాయం ఏర్పాటు చేశామని తెలిపారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌కు 5 కిలోమీటర్లు, కూర్మన్నపాలెంకు 10 కిలోమీటర్ల దూరంలో ఇది ఉందని పేర్కొన్నారు. నెల వారీ, వార్షిక మెంబర్ షిప్ సదుపాయం కూడా ఉందని, ఈ ప్రాంత ప్రజలు, యువత దీనిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సైల వెంకట పద్మలక్ష్మి శ్రీనివాస్, జెడ్పిటిసి సైల సన్యాసిరాజు, రావికమతం తహశీల్దారు అంబేద్కర్, ఎస్‌బిఐ ఆర్ఎమ్ అభిషేక్ కుమార్, మాజీ జెడ్పిటిసి సైలా జగన్నాధరావు, గొర్లివానిపాలెం, పరవాడ, వెన్నలపాలెం సర్పంచ్‌లు గోపి అమ్ములు, సిరపరపు అప్పలనాయుడు, వెన్నల అప్పారావు, టిడిపి నాయకులు కన్నూరు వెంకటరమణ, వియ్యపు చిన్న, వైసిపి నాయకులు కోన రామారావు, సైలా హరీష్ , సైలా పైడంనాయుడు, శ్రీఆద్య హాస్పిటల్ అధినేత డాక్టర్ బండారు బాలకృష్ణ, ఏఎంసి ప్రొఫెసర్ డాక్టర్ పి విజయ్ కుమార్, మాజీ సర్పంచ్ గొర్లి కనకారావు, ఆర్ఇసిఎస్ మాజీ చైర్మన్ చెల్లా కనకారావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిఐటియు మండల కార్యదర్శి నాయుడుబాబు

మిడ్డేమీల్స్ కార్మికులకు బిల్లులు, వేతనాలు చెల్లించాలి

ప్రజాశక్తి-కె.కోటపాడు : ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్నం భోజనం పథకాన్ని నిర్వహిస్తున్న మిడ్డేమీల్స్ కార్మికులకు వేతనాలు, బిల్లులు వెంటనే చెల్లించాలని సిఐటియు మండల నాయకులు ఈ.నాయుడుబాబు డిమాండ్ చేశారు. మండలంలోని ఎ.కోడూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌ను సందర్శించిన ఆయన మధ్యాహ్నం భోజన కార్మికులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. మిడ్డేమీల్స్ కార్మికులకు వేతనాలు, మెనూ ఛార్జీల బిల్లులు ఈ ఏడాది మార్చి నెల నుంచి ప్రభుత్వం విడుదల చేయలేదని తెలిపారు. దీంతో కార్మికులు ప్రైవేట్ వ్యక్తుల వద్ద నుంచి డబ్బులు వడ్డీలకు అప్పులు తెచ్చి ఈ పథకాన్ని నిర్వహించవలసి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. మెనూ ఛార్జీలు ప్రతి విద్యార్థికి రూ.20 ఇవ్వాలని, రాజకీయ వేధింపులు ఆపాలని, ప్రతి నెలా 10వ తేదీలోగా మెనూ ఛార్జీల బిల్లులు, వేతనాలు చెల్లించాలని, పెరిగిన ధరలకు అనుగుణం మెనూ ఛార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ నెల 9న జరుగు దేశవ్యాప్త సమ్మెలో మధ్యాహ్నం భోజన కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మిడ్డేమీల్స్ కార్మికులు మురుకుత బంగారమ్మ, కష్టమ్మ, చెల్లుబోయిన సన్యాసమ్మ, రాములమ్మ, సైలా అమ్మాజీ, శ్రీమంతుల లక్ష్మి, జరుకులమ్మ పాల్గొన్నారు.

అటల్ ఎఫ్‌డిపిపై ముగిసిన శిక్షణ

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక డైట్ ఇంజనీరింగ్ కళాశాలలో వారం రోజుల పాటు అటల్ ఎఫ్‌డిపిపై నిర్వహించిన శిక్షణ శనివారం ముగిసింది. గ్లోబల్ హెడ్ టెక్నాలజీ అడ్వైసర్ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ బాలాజీ పెద్ది డిజైన్ థింకింగ్ అప్రోచ్ టు రియల్ వరల్డ్ అప్లికేషన్ గురించి మాట్లాడారు. డిజైన్ థింకింగ్ అనేది ఏ సమస్యకైనా వినియోగదారుల అవసరాలను అర్థం చేసుకుని, వారి జీవన పరిస్థితుల ఆధారంగా సృజనాత్మక పరిష్కారాన్ని అందించడానికి ఉపయోగించే శక్తివంతమైన విధానమని పేర్కొన్నారు. హెల్త్‌కేర్, ఎడ్యుకేషన్, గవర్నెన్స్, వ్యాపార రంగాల్లో చాలా ఉపయోగకరమని తెలిపారు. ఎన్ఆర్డిసి డిప్యూటీ మేనేజర్ డాక్టర్ భవ్య మంజీరా ఉపాధ్యాయులకు, విద్యార్థులకు పేపర్ పబ్లికేషన్స్, డిజైన్ ట్రేడ్ మార్క్స్ గురించి క్షుణ్ణంగా వివరించారు. విద్యార్థులు వారి అకాడమిక్స్‌తో పాటు పేపర్ పబ్లికేషన్స్ చేయడం ద్వారా వారి కెరీర్లో ఇది ఒక ముఖ్య అంశంగా నిలుస్తుందని తెలియజేశారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.వైకుంఠ రావు, ఎఎఫ్‌డిపి కన్వీనర్ డాక్టర్ కె.సుజాత, డీన్ అకడమిక్, వైస్ ప్రిన్సిపల్, వివిధ విభాగాధిపతులు, ఉపాధ్యాలు, సిఎస్ఈ ఫ్యాకల్టీ, స్టూడెంట్స్ పాల్గొన్నారు.

బలిజపాలెంలో రేషన్ డిపో ప్రారంభం

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని నారపాడు పంచాయతీ శివారు బలిజపాలెం గ్రామంలో ఏర్పాటు చేసిన రేషన్ డిపోను శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ మామిడి శంకరరావు, వైస్ ఎంపీపీ-2మామిడి లక్ష్మి కొండాజీ, గ్రామస్తులు జెట్టి అప్పలరాజు, రొంగలి శ్రీను, మామిడి ప్రసాద్ పాల్గొన్నారు.

మెయిన్ స్కూల్ మూసివేసే కుట్ర ఆపాలి



మోడల్ స్కూల్‌కు ఆటోలో వెళ్లడానికి సిద్ధమైన విద్యార్థులు

ప్రజాశక్తి-దేవరాపల్లి

మండల కేంద్రం దేవరాపల్లిలోని ప్రభుత్వ ప్రాథమిక మెయిన్ పాఠశాలను మూసివేసేందుకు కుట్ర చేయడం ఆపాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.వెంకన్న శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పురాతనమైన ఈ పాఠశాలను నూతన విద్యా విధానం పేరుతో ప్లాన్ ప్రకారం మూసి వేయడానికి సిద్ధం చేశారని ఆరోపించారు. కోట్లు విలువ చేసే మెయిన్ స్కూల్ స్థలంపై అధికార పార్టీ నాయకుల కళ్లు పడ్డాయని పేర్కొన్నారు. బేసిక్ స్కూల్‌కు ఉండాల్సిన అన్ని అర్హతలు ఉన్నప్పటికీ ఎస్సీ కాలనీలో ఉన్న పాఠశాలను మోడల్ స్కూల్‌గా మార్పుచేసి ఈ మెయిన్ స్కూల్ నుండి 3, 4, 5 తరగతులకు చెందిన 26 మంది విద్యార్థులను అక్కడకు తరలించి ఇక్కడ 1, 2 తరగతులకు చెందిన కేవలం 13 మంది విద్యార్థులను ఉంచి ఫౌండేషన్ స్కూల్‌గా మార్చేశారని పేర్కొన్నారు. దీనిని ఒకటి రెండు సంవత్సరాలు కొనసాగించి తరువాత పిల్లలు లేరని చెప్పి పూర్తిగా మూసివేసి ఆ స్థలాన్ని కాజేసే దురుద్దేశంతో ఇటువంటి ఘాతుకానికి పూనుకున్నారని తెలిపారు. దీని వల్ల ఎలుకల కాలనీ, కోరుపోలు కళ్ళాలు, రాజులవీధి, దేవాంగుల వీధి, యాతపేట, గొంపవానిపాలెం (చిన్నంనాయుడు కాలనీ), రామాలయం వీధి, రజక పేట తదితర ప్రాంతాలకు చెందిన విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఎలుకలకాలనీ, కోరుపోలు కళ్ళాలకు చెందిన 3, 4, 5 తరగతుల విద్యార్థులు ప్రతి రోజూ రాను పోను రూ.20 ఆటో ఛార్జీలు పెట్టుకొని ఎస్‌సి కాలనీలో మోడల్ స్కూల్‌కు వెళ్ళవలసి వస్తుందని పేర్కొన్నారు. ఆ డబ్బులు పెట్టుకోలేక, పాఠశాలకు నడుచుకుంటూ వెళ్లలేక విద్యార్థులు చదువులకు దూరమయ్యే అవకాశం ఉందని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మెయిన్ స్కూల్‌ను బేసిక్ ప్రైమరీ స్కూల్ ఉంచాలనని డిమాండ్ చేశారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



ప్రజలతో కలిసి కరపత్రాలు చూపుతున్న ఎమ్మెల్యే రాజు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట, వడ్డాది : రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు స్థానిక ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు అన్నారు. సుపరిపాలనకు తొలి అడుగులో భాగంగా శనివారం మండలంలోని మంగళాపురం, విజయరామరాజుపేట, పి.భీమవరం, చిన్న అప్పన్నపాలెం గ్రామాలలో ఆయన పర్యటించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల అమలుపై ఆరా తీశారు. త్వరలోనే రోడ్ల నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, స్థానిక మాజీ సర్పంచ్ దొడ్డి కిషోర్, మాజీ జడ్పిటిసి కోటేశ్వరరావు, మాజీ ఎంపీపీ ఎంపీటీసీ సత్యనారాయణ, నాయకులు కర్రి తమునాయుడు, పినపోలు రామదాసు, కే. శ్రీరామ్మూర్తి, దొండ వెంకటరమణ, దొండా నరేష్, దొండా గిరిబాబు, సయ్యపురెడ్డి శ్రీనివాస్ పాల్గొన్నారు.

సబ్బవరం : మండలంలోని మొగలిపురం గ్రామంలో టిడిపి పెందుర్తి నియోజకవర్గం ఇన్‌ఛార్జి గండి బాబ్జి ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలను, అభివృద్ధిని వివరించారు. చిన్న గొల్లలపాలెంలో టిడిపి నేతలు పల్లా తాతారావు, కోరాడ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సుపరి పరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు గండి వంశీ దీప్, తమరాన బంగారు నాయుడు, అంగటి నానాజీ, లెక్కల అప్పలనాయుడు, పల్ల సన్యాసిరావు, కోన సోమేశ్వరరావు పాల్గొన్నారు.

అచ్యుతాపురం : మండలంలోని గొర్లి ధర్మవరం గ్రామంలో రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు శనివారం ఇంటింటి ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పీల తులసీరామ్, కాంగ్రెసుల అప్పారావు, దేశంశెట్టి వెంకటరమణ, ఎంపీటీసీ నీరుకొండ నరసింగరావు, యాండ్రా అప్పలనాయుడు పాల్గొన్నారు .

మాడుగుల : ఏడాది కూటమి పాలనలో అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలతో ప్రజలకు లబ్ధి చేకూరుతుందని శాసన సభ్యులు బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ కార్పొ రేషన్ చైర్మన్ బత్తుల తాతయ్య బాబుతో కలిసి మాడుగుల పట్టణంలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి ఏడాదికాలంగా ప్రజలకు అందిన సంక్షేమ పథకాలు వివరాలను తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ మార్కెట్ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు, పెద్దేరు జలాశయం చైర్మన్ అద్దేపల్లి జగ్గారావు, టిడిపి మండల ప్రధాన కార్యదర్శి ఉండూరు దేవుడు, మాజీ సర్పంచ్ నందా రపు సన్యాసిరావు, టిడిపి క్లస్టర్ ఇంచార్జ్ పుప్పాల రమేష్ పాల్గొన్నారు.

ఎర్రయ్య కుటుంబాన్ని ఆదుకుంటాం

ప్రజాశక్తి-అచ్యుతాపురం : సముద్రంలో చేపల వేటకు వెళ్లి గల్లంతైన చౌడిపల్లి ఎర్రయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకుంటుందని ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ అన్నారు. పూడిమడక పంచాయతీ కొండపాలెం గ్రామంలో ఎర్రయ్య తల్లిదండ్రులను, ఆయన కుటుంబీకులను శనివారం కలిసి పరామర్శించారు. గల్లంతైన ఎర్రయ్య గురించి ప్రభుత్వం అన్ని విధాల గాలింపు చర్యలు కొనసాగిస్తుందని చెప్పారు. ఎర్రయ్య గల్లంత విషయం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. ఎమ్మెల్యే వెంట మాజీ జడ్పిటిసి జనపరెడ్డి శ్రీనివాసరావు, మాజీ ఎంపీటీసీ మెరుగు బాపునాయుడు ఉన్నారు.

చెరుకు సాగుపై గిరిజన రైతులకు శిక్షణ

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం అఖిలభారత సమన్వయ సంస్థ చెరకు, గిరిజన ఉప ప్రణాళిక కింద గిరిజన రైతులకు చెరకు సాగు విధానాలు, సాంకేతిక పరిజ్ఞానంపై ఐదు రోజులు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ప్రాంతీయ పరిశోధనాస్థానం సహ సంచాలకులు డాక్టర్ సిహెచ్ ముకుందరావు, చెరుకు ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బి ఆదిలక్ష్మి ఆధ్వర్యంలో ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ వి చంద్రశేఖర్, తెగుళ్ళు, ఎంటమాలజీ విభాగం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బి భవాని ప్రధాన పాత్ర శిక్షణ ఇచ్చారు. 25 మంది గిరిజన రైతులు వివిధ ఉన్నత శ్రేణి ప్రాంతాల నుండి పాల్గొన్నారు. చెరుకు పండించడంలో పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. బెల్లం తయారీ, విలువ ఆధారిత ఉత్పత్తులపై శిక్షణ ఇవ్వడం జరిగింది. జ్యూస్ వేసుకునే బకెట్లు, ఎరువులు వేసుకునే పాత్రలు, చెరుకు నరికే కత్తులు, వర్మీకంపోస్టు కోకోపీట్ ఎన్రిచ్ మెన్యూర్ బయో ఫెర్టిలైజర్స్ కేజీ బెల్లం వేసుకునే అచ్చులు గిరి రైతులకు పంపిణీ చేశారు. అనంతరం వారికి సర్టిఫికెట్స్ అందజేశారు.

వైద్యాధికారులకు సత్కారం

ప్రజాశక్తి-అనకాపల్లి : నూతనంగా బాధ్యతలు స్వీకరించిన జిల్లా వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాసరావు, ఎన్‌టిఆర్ వైద్యాలయం సూపరిండెంట్ డాక్టర్ కృష్ణారావులను ప్రజా సంఘాల ఐక్యవేదిక ప్రతినిధులు శనివారం సత్కరించారు. ఎన్టీఆర్ వైద్యాలయం నిరుపేద రోగులకు దేవాలయం కావాలని, గ్రామీణ ప్రాంతాల్లో నుంచి వచ్చే రోగులకు అన్నివేళలా వైద్య సేవలు అందించే విధంగా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఐక్య వేదిక నాయకులు విల్లూరు పైడారావు, బొడ్డేడ అప్పారావు, డాక్టర్ చిన్నియాదవ్, ఆళ్ల ప్రవీణ్ కుమార్, బొడ్డు సోమరాజు, కొల్లి చిన్నఅప్పారావు, ఆడారి బుచ్చి రాము, బొబ్బిలి గోవిందరాజు, ముగడ అప్పారావు, పల్లా సత్య అప్పారావుపాల్గొన్నారు.



మాణికొండ సూర్యావతికి నివాళులర్పిస్తున్న ఐద్వా నేతలు

ఐద్వా దేశపాత్రునిపాలెం కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-పరవాడ : అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం దేశపాత్రునిపాలెం 10వ మహాసభ శనివారం జరిగింది. జివిఎంసి 79వ వార్డు పరిధి దేశపాత్రుని పాలెం గ్రామంలో జరిగిన ఈ మహాసభలో నూతన కమిటీ ఎన్నికైంది. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా అధ్యక్షులు పి.మాణిక్యం మాట్లాడుతూ వీధి కాలువలు శుభ్రపరిచాలని, కొత్త పెన్షన్లు, కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయాలని, మహిళలకు ఉపాధి కల్పించాలని మహాసభ తీర్మానం చేసింది. అనంతరం నూతన కమిటీ ఎన్నిక జరిగింది. అధ్యక్షులుగా మొండి జ్యోతి, కార్యదర్శిగా కర్రి రోషిణి, కమిటీ సభ్యులుగా కె.శారద, కె.రాణి, భవాని, కె.దేవి, లక్ష్మి, సంతు, కె.రమణమ్మ, ఎ.మణి, కె.వేణు, కె.సరళ, భారతి ఎన్నికయ్యారు. అక్టోబర్లో 13, 14, 15 తేదీల్లో ఐద్వా రాష్ట్ర మహాసభలు అనంతపురం జిల్లాలో జరుగుతాయని, అందులో పాల్గొని జయప్రదం చేయాలని మాణిక్యం విజ్ఞప్తి చేశారు.

కేటగిరీల వారీగా జీతాలు పెంచాలని ధర్నా

ప్రజాశక్తి-అనకాపల్లి : మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులకు జీవో నెంబర్ 36 ప్రకారం కేటగిరీల వారిగా వేతనాలు పెంచాలని కోరుతూ జీవిఎంసీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యాన జీవిఎంసీ అనకాపల్లి జోన్ కార్యాలయం వద్ద శనివారం ధర్నా నిర్వహించారు. అనంతరం సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి కోన లక్ష్మణ మాట్లాడుతూ మున్సిపల్ పర్మినెంట్ కార్మికులకు పెండింగ్లో ఉన్న డిఏలు, రిటైర్డ్ కార్మికులకు గ్రాట్యుటీ సత్వరం విడుదల చేయాలని కోరారు. ఈ నెల 15న మున్సిపల్ రంగంలో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ సిబ్బంది సమస్యలపై జరుగు చలో విజయవాడను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో నిమ్మకాయల నర్సింహామూర్తి, ఎర్రంశెట్టి అప్పలరాజు, బంగారి రవి, సోమిధుల శ్రీనివాస్, సింగంపల్లి అజయ్, ఎర్రంశెట్టి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేడు పెంపుడు కుక్కలకు రేబిస్ టీకాలు

ప్రజాశక్తి-సబ్బవరం : ప్రపంచ జూనోసిస్ డే సందర్భంగా ఈ నెల 6న పెంపుడు కుక్కలకు రేబిస్ వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్నట్లు సబ్బవరం ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ కె.ఉషా కుమారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జంతువుల నుండి మనుషులకు రేబిస్ వ్యాధి సోకకుండా ఉండాలంటే కుక్కలకు వ్యాధినిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించాలని సూచించారు. ఆదివారం ఉదయం 9 గంటల నుండి 12గంటల వరకు సబ్బవరం, గుల్లేపల్లి, అంతకాపల్లి, ఆరిపాక పశు వైద్య కేంద్రాల్లో ఈ వ్యాక్సినేషన్ కార్యక్రమం జరుగుతుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పాల సంఘం అధ్యక్షునిగా రామారావు

ప్రజాశక్తి-కశింకోట : మండలంలో బుచ్చయ్యపేట విశాఖ పాల సంఘం అధ్యక్షుడిగా తిర్రి రామారావు శనివారం ఎన్నికయ్యారు. ఈ మేరకు రామారావుకు పలువురు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగురైతు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉగ్గిన రమణమూర్తి, టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షులు తిర్రి చిరంజీవి, బుదిరెడ్డి రామారావు, ఎంపిటిసి బుదిరెడ్డి నాయుడు, కె.వెంకట అప్పారావు, కోన నూకినాయుడు, బుదిరెడ్డి శ్రీను, నిమ్మదాల రాజు, కరణం సహదేవుడు, బాబురావు పాల సంఘం సిబ్బంది పాల్గొన్నారు.



రామారావును అభినందిస్తున్న దృశ్యం

10న పేరెంట్స్ టీచర్స్ మీట్‌ను విజయవంతం చేయాలి

జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్

ప్రజాశక్తి-అనకాపల్లి

రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 10న ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మెగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ ఆదేశించారు. మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్, తల్లికి వందన అమలుపై శనివారం కలెక్టరేట్ సమావేశం మందిరంలో డిఆర్ఓ వై.సత్యనారాయణరావు, సిపిఒ జి.రామారావు, డిఎఫ్ఓ వినోద్ బాబుతో కలిసి నియోజకవర్గ, మండల ప్రత్యేక అధికారులు, ఎంఈఓలు, తహసీల్దార్లు, ఎంపిడీఓలు, అటవీ శాఖ అధికారులు, పోలీస్ అధికారులు, జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్‌తో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 1955 పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సుమారు 1.87 లక్షల మంది పాఠశాల విద్యార్థులు, 25 వేల మంది కళాశాల విద్యార్థులున్నట్లు చెప్పారు. అన్ని యాజమాన్యాల ప్రభుత్వ, ప్రైవేటు, గిరిజన, సాంఘిక, వెనకబడిన తరగతుల సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, గురుకుల పాఠశాలలు, ప్రభుత్వ ప్రయివేటు జూనియర్ కళాశాలల్లో మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. పాఠశాల అభివృద్ధికి కావలసిన మౌలిక వసతుల కల్పన, విద్యార్థుల చదువు, భవిష్యత్తు, ఆరోగ్యం తదితర అంశాలపై చర్చ జరుగుతుందని తెలిపారు. విద్యార్థులకు వైద్య పరీక్షలు జరిపి, వారి ఆరోగ్య స్థితిపై 10న వారికి అందించే హోలిస్టిక్ కార్డ్స్ నందు రిమార్క్స్ కాలంలో రిపోర్ట్ చేసి ఇస్తారని పేర్కొన్నారు. ఉన్నత స్థానాల్లో ఉన్న పూర్వ విద్యార్థులను ఆహ్వానించి సన్మానించడం జరుగుతుందన్నారు. ప్రతీ మండలాలనికి పేరెంట్స్ టీచర్స్ సమావేశం నిర్వహణకు మండల ప్రత్యేకాధికారులను నియమించామన్నారు. జిల్లా స్థాయిలో డిఆర్ఓ ఆధ్వర్యంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ విజయ కృష్ణన్

అక్రమ క్వారీలపై కలెక్టర్‌కు ఫిర్యాదు

సిపిఎం మండల కన్వీనర్ గంటా శ్రీరామ్

ప్రజాశక్తి-అనకాపల్లి : అక్రమ క్వారీ యజమానులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు సిపిఎం మండల కన్వీనర్ గంటా శ్రీరామ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అనకాపల్లి మండలంలో క్వారీ యజమానులతో కుమ్మక్కై అక్రమాలకు పాల్పడుతున్న మైనింగ్ శాఖ అధికారులు, సిబ్బందిపై కూడా చర్యలు తీసుకోవాలని కోరారు. అనుమతులకు మించి సుమారు పది రెట్లు వరకు అదనంగా మైనింగ్ చేస్తున్నా మైనింగ్ అధికారులు, సిబ్బంది పట్టించుకోవడం లేదని, అక్రమార్కులకు కొమ్ము కాస్తూ నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఎవరైనా ఫిర్యాదులు చేస్తే వారిని బెదిరిస్తున్నారన్నారు. బొలువాడ జగదాంబ క్వారీ సర్వే నెంబరు 211లో రెండున్నర హెక్టార్లకు అనుమతులు తీసుకొని అక్కడ విద్యుత్ స్తంభాలను సైతం కప్పి వేసి అక్రమ మార్గం ద్వారా మైనింగ్ చేస్తున్నారని తెలిపారు. అక్కడ విద్యుత్ వైర్లు తగిలి మేకలు చనిపోవడంపై మండల తహశీల్దారుకు ఫిర్యాదు చేశామన్నారు. దీనిపై అన్ని పత్రికల్లో వార్త వచ్చినా మైనింగ్, రెవెన్యూ అధికారులు విచారణ చేసి చర్యలు తీసుకోలేదన్నారు. మార్టూరు సర్వేనెంబర్1లో అపర్ణ, నవోదయ, మధుకాన్ క్రషర్ క్వారీ యాజమాన్యాలు నిబంధనలకు ఉల్లంఘించి గత 22 సంవత్సరాలుగా అక్రమ మైనింగ్ చేపడుతున్నా చర్యలు తీసుకోలేదని పేర్కొన్నారు. దీనివల్ల అక్కడ స్థానిక ప్రజలు, జంతు జీవాలు జీవించలేని పరిస్థితి ఉందని, పర్యావరణ కలుషితమై తీవ్ర నష్టం జరుగుతుందని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని శ్రీరామ్ కోరారు.



రికార్డులు తనిఖీ చేస్తున్న డిఎంహెచ్ఒ హైమావతి

పిహెచ్‌సిలో డిఎంహెచ్ఒ తనిఖీ

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : బుచ్చయ్యపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని అనకాపల్లి జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఎం.హైమావతి శనివారం ప్రైమరీ తనిఖీ చేశారు. ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలను డాక్టర్ కె.రమేష్‌ని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి రమేష్, సిహెచ్ఓ బి.దేముడు,హెల్త్ సూపర్వైజర్ మామిడి రామకృష్ణ, ఫార్మసిస్ట్ పుణ్యవతి, ఎల్లి వెంకటరమణ, సిబ్బంది పాల్గొన్నారు.

జగన్నాథ స్వామిని దర్శించుకున్న నాగజగదీష్

ప్రజాశక్తి-అనకాపల్లి రూరల్ : స్థానిక ఇంద్రజమ్మ హాల్‌లో ఉన్న బలభద్ర సుభద్ర సమేత జగన్నాథస్వామిని శనివారం శాసనమండలి మాజీ సభ్యులు బుద్ద నాగ జగదీశ్వరరావు దర్శించుకున్నారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవ కమిటీ చైర్మన్ దాడి బుజ్జి నాగజగదీష్ ను సత్కరించి స్వామి వారి చిత్రపటాన్ని బహూకరించారు. కార్యక్రమంలో శ్రీభోగలింగేశ్వర దేవస్థానం చైర్మన్ కాండ్రేగుల సత్యనారాయణ, బోడి వెంకటరావు, కుప్పిలి జగన్, పొలిమేర నాయుడు, శ్రీకాకుళం గణపతి, పిల్లా తారకేశ్వరరావు, కాండ్రేగుల జగదీష్, సూరిశెట్టి బల్లమ్మ, యలమంచిలి బంగార్రాజు, కాండ్రేగుల రవీంద్ర, కాండ్రేగుల వెంకట సూరిబాబు, గుర్రాల వాసు, విల్లూరి రమణబాబు, కొణతాల బాల పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పంచకర్లను కలిసిన శాప్ డైరెక్టర్

ప్రజాశక్తి-సబ్బవరం : ఏపి స్పోర్ట్స్ అథారిటీ (శాప్) డైరెక్టర్‌గా ఇటీవల నియమితులైన పిబివిఎస్ఎన్ రాజు (బుచ్చిరాజు) పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబుని ఆయన స్వగృహంలో శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. రమేష్‌బాబుకు పుష్పగుచ్ఛం ఇచ్చి దుశ్శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఆయన వెంట సబ్బవరం టిడిపి మండల ప్రధాన కార్యదర్శి కోరాడ శ్రీనివాస్, 95వ వార్డు ప్రెసిడెంట్ దాట్ల మధు, టిడిపి అధ్యక్షుడు కరక దేముడు తదితరులున్నారు.

సహిత విద్యపై అవగాహన

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట

సహిత విద్య ద్వారా అందిస్తున్న సేవలను వికలాంగ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ బి.కాశీ విశ్వేశ్వరరావు అన్నారు. మండలంలోని దిబ్బిడి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో వికలాంగులు, వారి తల్లిదండ్రులకు సహిత విద్య కార్యక్రమాలపై శనివారం అవగాహన కల్పించారు. సహిత విద్య ద్వారా వికలాంగ విద్యార్థులకు ఎన్నో సదుపాయాలను ప్రభుత్వం కల్పిస్తుందని, తల్లి దండ్రులు తమ పిల్లలను క్రమం తప్పకుండా పాఠశాలకు పంపించాలని కోరారు. అనంతరం విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్లను అందజేశారు. కార్యక్రమంలో ఏపీఎన్ మూర్తి, డివిజె అప్పారావు, బిసెట్టి అప్పలరాజు, సామాజికవేత్త వడ్డి సత్యారావు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లు, విద్యుత్ ఛార్జీలపై సిపిఐ ధర్నాలు

ప్రజాశక్తి-సీతమ్మధార : స్మార్ట్ మీటర్స్ విధానాన్ని రద్దు చేయాలని, ప్రజలపై తీవ్ర ఆర్థిక భారం పడే అదానితో సోలార్ విద్యుత్ ఒప్పందాన్ని ఉపసంహరించుకోవాలని కోరుతూ సీతమ్మధారలోని విద్యుత్ కార్యాలయం వద్ద సిపిఐ జిల్లా సమితి ఆధ్వర్యన ధర్నా చేశారు. సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి.సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ, ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం అధికారంలోకొస్తే విద్యుత్ ఛార్జీలు తగ్గిస్తామని, స్మార్ట్ మీటర్లను పగలగొట్టాలని అదాని, సెకీ సంస్థలతో విద్యుత్ ఒప్పందాన్ని రద్దు చేస్తామని హామీ ఇచ్చి నేడు అధికారంలోకి వచ్చిన తర్వాత ఏడాది కాలంలో విద్యుత్ ఛార్జీలను మూడుసార్లు పెంచి ప్రజలపై రూ.15,487 కోట్లను భారం వేయడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.రెహమాన్, నాయకులు కె.సత్యనారాయణ, పి.చంద్రశేఖర్, ఎం.పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

తగరపువలస : సిపిఐ భీమిలి ఏరియా సమితి ఆధ్వర్యాన చిట్టివలస విద్యుత్ సబ్ స్టేషన్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా పార్టీ ఏరియా సమితి కార్యదర్శి కానూరు రాంబాబు, సహాయ కార్యదర్శి మోర అప్పలరాజు మాట్లాడారు. అనంతరం విద్యుత్ సబ్ స్టేషన్ ఎఇ బి.రవికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సన్నిబాబు, లక్ష్మణరావు, గోవిందరావు, ముత్యాలరావు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి : సిపిఐ ఆధ్వర్యంలో శనివారం ఆర్టీవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు నేతృత్వంలో ప్రభుత్వ స్మార్ట్ మీటర్స్‌ను సిపిఐ నాయకులు బద్దలగొట్టారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు పరమేశ్వరి, జి.ఫణీంద్ర కుమార్, వియ్యపు రాజు, గొర్లె దేముడుబాబు, కోరిబిల్లి శంకరరావు, కాసుబాబు, పోతురాజు, సత్తిబాబు, త్రినాథ్, సత్యనారాయణ, ఎం.సూరిబాబు, ఈశ్వరరావు, బుజ్జి పాల్గొన్నారు.

వడ్డాది : విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగించడం ఆపకపోతే రాబోయే రోజుల్లో కూటమి ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ది చెబుతారని సిపిఐ నాయకులు అప్పలరాజు హెచ్చరించారు. బుచ్చయ్యపేట మండలం వడ్డాదిలోని విద్యుత్ కార్యాలయం వద్ద సిపిఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి ఎలక్ట్రికల్ ఏఈకి వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో రావాడ వరహాలు, వర్రి సూరిబాబు, ముత్యాలు, రావాడ నాయుడు, ఎర్రి నాయుడు, రాము, పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్ : విద్యుత్ భారాలు వ్యతిరేకిస్తూ శనివారం పెదబొడ్డేపల్లి విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద సిపిఐ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి మాకిరెడ్డి రామునాయుడు మాట్లాడుతూ పెంచిన విద్యుత్ ఛార్జీలు తగ్గించాలనీ, స్మార్ట్ మీటర్ల బిగించే కార్యక్రమాన్ని వెంటనే ఆపాలని, అదానీతో చేసుకున్న సోలార్ విద్యుత్ ఒప్పందాలు వెంటనే రద్దు చేసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బాలేపల్లి వెంకటరమణ, నాయకులు గొల్లు గురుబాబు, ఎమ్.లక్ష్మి, జి.రాధాకృష్ణ, వెలుగుల అర్జున రావు, మేకా భాస్కరరావు పాల్గొన్నారు.



విశాఖలో ధర్నా చేస్తున్న సిపిఐ నాయకులు

సార్వత్రిక సమ్మె.. ప్రభుత్వానికి హెచ్చరిక

-లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాల్సిందే
-విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో బైకు ర్యాలీలు, ప్రచార జాతాలు



నర్సీపట్నంలో జాతాను చేపడుతున్న నేతలు

విశాఖ కలెక్టరేట్ : ఈ నెల 9న జరిగే జాతీయ సమ్మెను జయప్రదం చేయాలంటూ శనివారం విశాఖ నగరంలో అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ప్రారంభమైన ఈ ర్యాలీ జైల్ రోడ్డు, జగదాంబ జంక్షన్, పూర్ణా మార్కెట్, టౌన్ కొత్త రోడ్డు, రామకృష్ణ జంక్షన్, డాబా గార్డెన్స్, ఆర్‌టిసి కాంప్లెక్స్, గురుద్వారా జంక్షన్ మీదుగా సాగి మద్దిలపాలెం వద్ద ముగిసింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు కెఎం.శ్రీనివాస్, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు ఎం.మన్మథరావు మీడియాతో మాట్లాడారు. బ్రిటీష్ కాలం నుంచి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను మార్చి కేంద్ర బిజెపి ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లు తెచ్చిందన్నారు. దీంతో కార్మికుల ప్రాథమిక హక్కులైన సంఘం పెట్టడం, సమ్మెలు చేయడంతో సహా అనేక హక్కులు కోల్పోతారన్నారు. 8 గంటల బదులు 12 గంటలు చేయాలని లేబర్ కోడ్‌లు చెబుతున్నాయన్నారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ దారుణమన్నారు. బైకు యాత్రలో సిఐటియు జిల్లా కార్యదర్శి బి.జగన్, నాయకులు వి.కృష్ణారావు, వై.రాజు, కె.కుమారి, పి.వెంకటరావు, ఎఐటియుసి నాయకులు జెడి.నాయుడు, నాగరాజు, వైఎస్ఆర్‌టియుసి నాయకులు అనిల్ కుమార్ పాల్గొన్నారు.

మధురవాడ : జివిఎంసి 7వ వార్డు పరిధిలోని ద్రోణంరాజు కల్యాణ మండపం ఆవరణలో ప్రజారోగ్య, క్లాప్ డ్రైవర్లు, లోడర్లు, ఇతర కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సిఐటియు జోన్ అధ్యక్షులు డి.అప్పలరాజు మాట్లాడుతూ, ఈ నెల 9వ తేదీన జరిగే సార్వత్రిక సమ్మెలో కార్మికులందరూ పాల్గొని విజయ వంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్.రామప్పుడు, బి.రాంబాబు, ఎం.రాజు, కె.సన్నీ, వి.గోవిందు, బి.నరసయ్యమ్మ, సుజాత, ఆర్.రవి, అప్పలరాజు పాల్గొన్నారు.

ఆరిలోవ : అఖిల భారత సమ్మెలో భాగంగా జివిఎంసి 10, 12 వార్డుల పారిశుధ్య కార్మికులతో వార్డు కార్యాలయాల వద్ద జనరల్ బాడీ సమావేశాలు నిర్వహించారు. జులై 9 అఖిల భారత సమ్మెలో పాల్గొవాలని జివిఎంసి పారిశుధ్య కార్మికులు ఈ సమావేశంలో నిర్ణయించారు. ఈ సందర్భంగా సిఐటియు మద్దిలపాలెం జోన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి వి.నరేంద్రకుమార్ మాట్లాడుతూ, కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అదానీ, అంబానీలకు కొమ్ముకాస్తూ కార్మికులపై దాడి చేయడం తగదన్నారు. ఈ సమావేశంలో సిఐటియు నాయకులు పి.శంకర్, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు. అనంతరం సమ్మెను పోస్టర్‌ను ఆవిష్కరించారు.

పెందుర్తి : జివిఎంసి 96వ వార్డు పరిధి అన్న క్యాంటీన్ వద్ద కార్మికులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ గౌరవాధ్యక్షులు పి.వెంకటరెడ్డి మాట్లాడుతూ గిరిప్రదక్షిణకు డ్యూటీలు వేసినా సరే సమ్మె ఆగదని స్పష్టంచేశారు.

అచ్యుతాపురం : కేంద్రంలోని మోడీ ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్స్ కోడ్స్‌ను రద్దు చేయాలని కోరుతూ ఈ నెల 9న జరుగు దేశ వ్యాప్త కార్మిక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ అచ్యుతాపురం ఎస్ఇజెడ్‌లోని పరిశ్రమలలో శనివారం ప్రచార జాతా నిర్వహించారు. ఫార్మా, ఎస్ఈజెడ్ పరిపాలన భవనం, హరిపాలెం తిమ్మరాజుపేట గ్రామాల్లో ఈ జీపు జాతా సాగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శంకర్రావు, ఆర్ రాము, ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు, ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా కన్వీనర్ కాండ్రేగుల రామ సదాశివరావు మాట్లాడారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను మోడీ ప్రభుత్వం యజమానులకు అనుకూలంగా మార్పు చేసి నాలుగు లేబర్ కోడ్స్ తీసుకొచ్చిందని తెలిపారు. ఇవి అమలైతే కార్మికులు కట్టుబానిసలుగా మారిపోతారన్నారు. సిఐటియు మండల కన్వీనర్ కె.సోమునాయుడు, ఆటో యూనియన్ నాయకులు తట్ట రాజు, ఎస్.రాము నాయుడు, ఆర్.సత్తిబాబు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చోడవరం : ఈ నెల 9న జరుగు సమ్మె జయప్రదం చేయాలని చోడవరంలో సిఐటియు ప్రచార జాతా శనివారం జరిగింది. కనీస వేతనాలు చట్టం అమలు, సమాన పనికి సమాన వేతనం డిమాండ్స్‌పై ఈ సమ్మె జరుగుతుందని సిఐటియు జిల్లా కోశాధికారి వివి శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని లక్కవరం, జుత్తాడ, గోవాడ, వెంకన్న పాలెం గ్రామంలో ప్రచారం చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు ఎస్‌వి.నాయుడు, నాగిరెడ్డి సత్యనారాయణ, దేముళ్ళు, వెంకటరావు, రాజు పాల్గొన్నారు.

దేవరాపల్లి : దేశవ్యాప్త సమ్మె వాల్ పోస్టర్‌ను దేవరాపల్లిలో సిపిఎం ఆధ్వర్యాన శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి బిటి.దొర మాట్లాడుతూ సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం 8 గంటల పని విధానాన్ని 10 గంటలకు మార్చడాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాగరాజు, మల్లన్న, నాయుడుపాల్గొన్నారు.



పెందుర్తిలో మాట్లాడుతున్న వెంకటరెడ్డి

నర్సీపట్నం టౌన్: కేంద్ర బిజెపి ప్రభుత్వం విధానాలను నిరసిస్తూ సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని నర్సీపట్నంలో ప్రచార జాతా శనివారం ప్రారంభమైంది. బిజెపి ప్రభుత్వం తెచ్చిన లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలని, 10 గంటల పెంపుని ఉపసంహరించాలని, అసంఘటితరంగ కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో ఈనెల 9న దేశవ్యాప్తంగా జరుగుతున్న సార్వత్రిక సమ్మెలో భాగంగా శనివారం నర్సీపట్నంలో జాతాను టాక్స్ పేయర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కె. త్రిమూర్తులురెడ్డి ప్రారంభించారు. నర్సీపట్నం, రోలుగుంట, మాకవరపాలెం, నాతవరం, గొలుగొండ మండలాల్లో ఈ ప్రచారం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఇరెల్లి చిరంజీవి, కళాసి కార్మికులు పాల్గొన్నారు.

రోలుగుంట: ఈ నెల 9వ తేదీన జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని రోలుగంట మండలంలో సిఐటియు నాయకులు ఈరెల్లి చిరంజీవి ఆధ్వర్యంలో ప్రచార జాత నిర్వహించారు. మండలంలో బుచ్చంపేట, కుసర్లపూడి, రోలుగుంట గ్రామాల్లో ఈ జాత కొనసాగింది. ఈ సందర్భంగా ఈరెల్లి చిరంజీవి మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటుపరం చేయవద్దని డిమాండ్ చేశారు.



వినతిపత్రాన్ని ఇస్తున్న నాయకులు

వితంతు పింఛన్ల మంజూరుకు వినతి

ప్రజాశక్తి - చీడికాడ: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం దాటినా వితంతువులకు కొత్త పెన్షన్లు మంజూరు చేయకపోవడం బాధాకరమని వైసిపి మండల పార్టీ కన్వీనర్ గొల్లవిల్లి రాజుబాబు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం ప్రతినిధులతో కలిసి చీడికాడ మండల పరిషత్ అభివృద్ధి అధికారి హేమ సుందర్ రావు కి వినతిపత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా భర్త చనిపోయిన భార్యలకి మరుసటి నెల నుండే పింఛన్ మంజూరు అయ్యేలా చూడాలన్నారు. భర్త చనిపోయి సంవత్సరం అయినా ఇంకను కొంతమందికి కొత్త పింఛన్లు మంజూరు చేయకపోవడంతో వారు సచివాలయం చుట్టూ తిరుగుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి గ్రామ పార్టీ అధ్యక్షులు పరవాడ మహేష్, పాల సంఘం అధ్యక్షులు కొండబాబు, సిడిసి చైర్మన్ సుంకర శ్రీనివాసరావు, కార్యకర్తలు కొల్లి శ్రీనివాసరావు, ఎం అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



పరిశీలిస్తున్న ఎంపిడిఓ

సంపద కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి -చీడికాడ: చీడికాడ, ఎల్బీ పట్నం, జైతివరం, బి సింగవరం గ్రామాలలో డిప్యూటీ ఎంపీడీవో చంద్రశేఖరరావు పర్యటించారు. మంచినీటి ట్యాంక్, చెత్త నుండి సంపద కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వర్షా కాలం కారణంగా గ్రామాలలో శానిటేషన్ పట్ల జాగ్రత్త వహించాలన్నారు. మంచినీటి ట్యాంకులను క్లోరినేషన్ కలిపి ప్రజలకు మంచినీటి అందించాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులు సన్యాసిరావు పాల్గొన్నారు.



పరామర్శిస్తున్న అమర్‌నాథ్, నేతలు

మాజీ ఎమ్మెల్యే గణేష్‌కు పరామర్శ

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ గత ఐదు రోజులుగా వైరల్ జ్వరంతో విశాఖపట్నం మెడికవర్ హాస్పటల్‌లో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న జిల్లాకు చెందిన వైసిపి మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, నాయకులు శనివారం మాజీ ఎమ్మెల్యే గణేష్ ను పరామర్శించారు. పరామర్శించిన వారిలో మాజీ మంత్రి, జిల్లా పార్టీ అధ్యక్షులు గుడివాడ అమర్నాధ్, పెందుర్తి మాజీ ఎమ్మెల్యే అదీప్ రాజ్, అనకాపల్లి పార్లమెంట్ సమన్వయకర్త కరణం ధర్మశ్రీతో పాటు నాయకులు శరగడం చిన అప్పలనాయుడు, యలమంచిలి ఎంపిపి గోవింద్ ఉన్నారు.

7న మాకవరపాలెం మండల సమావేశం

ప్రజాశక్తి-కోటవురట్ల: మాకవరపాలెం మండల సర్వసభ్య సమావేశం ఈనెల 7న నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఛాయాసుధ తెలిపారు, ఉదయం 10:30 కు ప్రారంభమయ్యే సమావేశానికి ఎంపిటీసీలు, సర్పంచులు, మండల స్థాయి అధికారులు హాజరు కావాలని కోరారు.



మాట్లాడుతున్న నాగమణి

నిషేధ సమయంలో వేటకు వెళ్లొద్దు

ప్రజాశక్తి-గొలుగొండ: నిషేధ సమయంలో మత్స్యకారులు వేటకు వెళ్లవద్దని తాండవ మత్స్యశాఖ తనిఖీ అధికారి టి.నాగమణి అన్నారు. గురువారం గొలుగొండ మండలం తాండవ పరివాహక ప్రాంతాలైన సాలికమల్లవరం, వెంకటాపురం, పొగచెట్లపాలెంలో దండోరా వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, తాండవ రిజర్వాయర్‌లో చేపల సంతానోత్పత్తి సమయమైన జులై 1 నుంచి ఆగస్టు 31 వరకు 62 రోజుల వేట నిషేదం అమల్లో ఉంటుందన్నారు. ఈ సమయాల్లో వేటకు వెళ్ళవద్దని, వెళితే చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ సంచాలకులు సిహెచ్.యశోద పాల్గొన్నారు.

రోడ్డుపై గోతులు పూడ్చివేత


ప్రజాశక్తి-రోలుగుంట: రోలుగుంట తహశీల్దార్ కార్యాలయం ఎదురుగా గల ఆర్అండ్‌బి రోడ్డు రోడ్డులో గోతులను ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పూడ్చివేయించారు. ఎంపీపీ సొంత ఖర్చుతో ట్రాక్టర్ల ద్వారా క్రషర్ బొగ్గును తెప్పించి గోతులను పూడ్చించారు. వైసిపి విస్తృత స్థాయి సమావేశం జరగనున్న నేపథ్యంలో ఈ చర్యలు చేపట్టినట్లు ఎంపిపి తెలిపారు.



గోతులను కప్పుతున్న దృశ్యం

భవిత రిసోర్స్ పర్సన్‌గా విజయ్ కుమార్

ప్రజాశక్తి-కోటవురట్ల: మాకవరపాలెం భవిత కేంద్ర కేంద్రంలో ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ పర్సన్‌గా శనివారం విజయ్ కుమార్ విధుల్లోకి చేరారు. ఆయన పాయకరావుపేట నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారని ఎంఈఓ 1 జాన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ 2 పిఎస్ఎన్ మూర్తి, ఈఈఆర్‌పి మంగ, సిబ్బంది పాల్గొన్నారు.



నియామక పత్రాన్ని ఇస్తున్న ఎంఇఓ

రేబిస్ టీకాలు వేయించాలి

ప్రజాశక్తి -మాడుగుల: ప్రపంచ జూనోసిస్ దినోత్సవ సందర్భంగా మండలంలోని అన్నీ పశు వైద్య శాలల్లో ఈ నెల 6వ తేదీ ఆదివారం పెంపుడు కుక్కలకు ఉచిత రేబిస్ టీకాలు వేయడం జరుగుతుందని ఏరియా పశు వైద్యశాల సహాయ సంచాలకులు చిట్టి నాయుడు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పెంపుడు కుక్కలకు ర్యాబిస్ వ్యాధి సోకకుండా ముందస్తు జాగ్రత్తగా టీకాలు వేయించాలని సూచించారు. స్థానిక పశు వైద్యశాలల్లో ఈ టీకాలు పెంపుడు కుక్కలకు ఉచితంగా వేస్తామన్నారు.



మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్న సిబ్బంది

డెక్కన్ కంపెనీలో మాక్ డ్రిల్

ప్రజాశక్తి-పాయకరావుపేట:తెలంగాణ రాష్ట్రంలో ఫార్మాలో ఇటీవల జరిగిన దుర్ఘటన నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ఫ్యాక్టరీస్ డిపార్ట్మెంట్ ఆదేశాల మేరకు ఎమర్జెన్సీ స్పందనను పరీక్షించేందుకు మాక్ డ్రిల్లులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో భాగంగా శనివారం డెక్కన్ ఫైన్ కెమికల్స్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్, ఎస్ఇజెడ్‌లో డిప్యూటీ చీఫ్ ఇన్ స్పెక్టర్ ఫ్యాక్టరీస్ పరమేశ్వరరావు పర్యవేక్షణలో అత్యుత్తమ స్థాయిలో ఈ మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ మాక్ డ్రిల్ అనంతరం పరమేశ్వరరావు సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ... డెక్కన్ ఫైన్ కెమికల్స్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్ భద్రతా సదుపాయాలు, అత్యవసర పరిస్థితులను నిర్వహించడంలో సంసిద్ధతను ప్రశంసించారు. ఫ్యాక్టరీలలో ఎమర్జెన్సీ సమయంలో తక్షణ స్పందన కోసం ఇలాంటి మాక్ డ్రిల్లులు ఎంతో కీలకమని చెప్పారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి మాక్ డ్రిల్ నిర్వహించడం ద్వారా ప్రాణాలను రక్షించగలమని స్పష్టం చేశారు.



సర్వే చేస్తున్న అధికారులు

ఆర్ అండ్ బి స్థలం సర్వే

ప్రజాశక్తి -కోటవురట్ల:మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఆర్ అండ్ బి రోడ్డుపై చెరువును తలపించే విధంగా నీరు నిలిచిపోతూ ఉండడంతో కాలువ నిర్మాణానికి అధికారులు సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంజనీరు నారాయణరెడ్డి మాట్లాడుతూ, రోడ్డు పై నీళ్లు నిలిచిపోతూ ఉండడంతో ప్రజలు పడుతున్న ఇబ్బందుల దృష్ట్యా కాలువ నిర్మాణానికి స్థలాన్ని సర్వే నిర్వహిస్తున్నామన్నారు. మండల పరిషత్ పంచాయతీ అధికారులు కాలువ నిర్మించేందుకు నిధులు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. గతంలో కూడా రెండు మూడు సార్లు సర్వే నిర్వహించామని సమీప ప్రాంత ప్రజలు సహకరించక పోవడంతో వెనుతిరిగామని దీంతో ఆర్ అండ్ బి స్థలం ఎంతవరకు ఉందో సర్వే నిర్వహించి హద్దులు కేటాయిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్వే అధికారులు, స్థానిక ఎంపిటిసి సూర్యారావు, కార్యదర్శి నరసింహారావు పాల్గొన్నారు.

ఎంఆర్‌పిఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-పాయకరావుపేట: ఈ నెల 7 జరిగే ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ పుట్టినరోజు వేడుకలను పాయకరావుపేట నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లోనూ ఘనంగా నిర్వహించాలని అనకాపల్లి జిల్లా ఎమ్మార్పీఎస్ ఇంఛార్జి పోసపల్లి వెంకట్రావు పిలుపునిచ్చారు. శనివారం సాయంత్రం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, పాయకరావుపేట నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లోనూ ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరణలు, కేక్ కటింగులు చేసి ఈ వేడుకలను ఘనంగా నిర్వహించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ పాయకరావుపేట నియోజకవర్గ ఇంఛార్జి గంపల చినరాజు, మాజీ ఇంఛార్జి సలికే గోవిందరావు, గౌరవ అధ్యక్షులు గంపల సుబ్బారావు, మండల అధ్యక్షుడు ఆరుగుల రమేష్, పట్టణ అధ్యక్షుడు ఆరుగుల కొండబాబు, నాయకులు గంపల వీరబాబు, గంటేడ రమణ (జాన్) తదితరులు పాల్గొన్నారు.

సాగులో ఉన్న దళిత రైతులకు పాస్ పుస్తకాలు మంజూరు చేయాలి

ప్రజాశక్తి -రావికమతం:డి. పట్టా కలిగి సాగులో ఉన్న దళితుల భూములను ప్రభుత్వ భూములుగా జగనన్న రీ సర్వేలో నమోదు చేయడం చాలా దారుణమని జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం సహాయ కార్యదర్శి కే.గోవిందరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శనివారం గర్నికం రెవిన్యూ పరిధిలో డి.పట్టా కలిగి సాగులో ఉన్న రైతులతో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా గోవిందరావు మాట్లాడుతూ గర్నికం రెవెన్యూ పరిధిలో 16 మంది దళిత కుటుంబాలకు 20 ఎకరాల భూమిని ప్రభుత్వం గతంలో మంజూరు చేసిందన్నారు. ఈ భూముల్లో జీడి, మామిడి తోటలు వేసుకొని ఆయా కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయన్నారు. ఈ భూములపై బ్యాంకులో రుణాలు తెచ్చుకోవాలన్నా, అన్నదాత సుఖీభవ పథకం వర్తించాలన్నా, రెవెన్యూ సర్వే అధికారులు ప్రభుత్వ భూమిగా నమోదు చేసిన దానిని తొలగించి దళిత రైతుల పేరున నమోదు చేసినట్లయితే వీరికి రుణాలు, అన్నదాత సుఖీభవ పథకాలు వర్తిస్తాయన్నారు. లేకుంటే వీరు పూర్తిగా ఈ పథకాలకు నోచుకోలేరని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం పట్టాలు కలిగివున్న రైతులకు రీసర్వే లో పాస్ పుస్తకాలు, ఆన్లైన్ చేయించాల్సి ఉండగా ఆ దిశగా నోచుకోక పోవడం చాలా దారుణమన్నారు. జగనన్న రీ సర్వేలో అనేక రకాల అక్రమాలు, అవినీతి ,తప్పు తడకలు జరిగాయని ఉదరగొట్టిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆ దిశగా చర్యలు చేపట లేదన్నారు. ప్రభుత్వం రెండు పర్యాయాలు గ్రామాలలో రెవెన్యూ సదస్సులను ఏర్పాటు చేసి రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించడం జరిగిందన్నారు. అయితే ఏడాది గడుస్తున్నా నేటికీ పరిష్కారం కాకపోవడం చాలా దారుణం అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.రెవెన్యూ సమస్యలన్నీ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారిందన్నారు. వాటి పైన తక్షణమే జిల్లాస్థాయి అధికారులు, జిల్లా జాయింట్ కలెక్టర్ చర్యలు తీసుకొని రైతులకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశ్నారు. ఈ కార్యక్రమంలో కుల వివక్ష పోరాట కమిటీ మండల కార్యదర్శి సి హెచ్. సూరిబాబు, రైతులు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న గోవిందరావు, దళిత రైతులు

విద్యార్థులు బాగా చదువుకోవాలి

ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

ప్రజాశక్తి-మాడుగుల:తల్లితండ్రుల ఆశయాలకు అనుగుణంగా విద్యార్థులు విద్యారంగంలో రాణించాలని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి పేర్కొన్నారు. శనివారం మాడుగుల డిగ్రీ కళాశాలను ఆయన సందర్శించారు. అనంతరం సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విద్య పట్ల శ్రద్ధ కనబరిచాలని కోరారు. తల్లిదండ్రుల ఆశయ సాధనకు అనుగుణంగా ఉన్నత శిఖరాలకు ఎదగాలని తెలిపారు. చెడు నడతలకు దూరంగా ఉండాలని కోరారు. అనంతరం 83 మంది విద్యార్థులకు స్కాలర్షిప్ చెక్కులను అందజేశారు. అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ డిగ్రీ కళాశాలకు 1.10 కోట్ల రూపాయలు నిధులు మంజూరు చేశారని పేర్కొన్నారు. తాత్కాలిక డిగ్రీ కళాశాల షెడ్లు నిర్మాణం సంబంధించి 10 లక్షలు మంజూరు చేయగా ఆ చెక్కును కళాశాల ప్రిన్సిపాల్ శాస్త్రి కి అందజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు, క్లస్టర్ ఇంచార్జ్ పుప్పాల రమేష్, రంజిత్ వర్మ, కాశి బాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే బండారు

పి 4 సర్వేపై అశ్రద్ధ వహించవద్దు

మాడుగుల : ప్రభుత్వం ఆదేశించిన పి4 సర్వేలో అశ్రద్ధ వహించవద్దని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి పేర్కొన్నారు. శనివారం మాడుగుల పంచాయతీరాజ్ అతిథి గృహంలో నియోజకవర్గ నాలుగు మండలాల అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రతి గ్రామంలో పి4 సర్వే పటిష్టంగా నిర్వహించి నివేదికను ప్రభుత్వానికి అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాజారామ్, నియోజకవర్గ ప్రత్యేక అధికారి మోహన్‌రావు, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి, అధికారులు పాల్గొన్నారు.

పరిశుభ్రతపై అవగాహన

ప్రజాశక్తి -చీడికాడ: ప్రతి ఒక్కరు కూడా పరిశుభ్రతను పాటించాలని పంచాయతీ కార్యదర్శి సన్యాసిరావు తెలిపారు. చీడికాడ మండల కేంద్రంలో బీసీ కాలనీలో మండల పరిషత్ ప్రైమరీ పాఠశాలలో ప్రభుత్వం ఆదేశించిన నెలలో 3వ శనివారం శుభ్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించాలని ఆదేశాల మేరకు విద్యార్థులకు శుభ్రతకు ఆరు సూత్రాలు వివరించారు. ఆహారం తీసుకునే ముందు చేతులను శుభ్రంగా సబ్బుతో కడుక్కోవాలని, బాత్రూం వాడిన తర్వాత కూడా చేతులను శుభ్రంగా కడుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గణపతి, సచివాలయం సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ కార్యకర్త, ఆయా తదితరులు పాల్గొన్నారు.



శుభ్రతపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

నాడు-నేడు పేరుతో గత ప్రభుత్వం దోపిడీ

-హోం శాఖ మంత్రి అనిత



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న హోం మంత్రి అనిత

ప్రజాశక్తి -నక్కపల్లి:గత ప్రభుత్వంలో నాడు-నేడు పేరుతో దోచుకున్నారని, కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో ప్రజలు సంతృప్తికరంగా ఉన్నారని హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. యస్ రాయవరం మండలం, ధర్మవరం గ్రామంలో హోం మంత్రి వంగలపూడి అనిత శనివారం దుర్గాదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి ఇంటింటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం గత ఏడేళ్లలో చేపట్టిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఉపాధి హామీ పథకం ద్వారా రూ 8.40 లక్షల నిధులతో నిర్మించిన సిమెంట్ రోడ్డును మంత్రి ప్రారంభించారు. అనంతరం గ్రామస్తులతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొని వారి యోగక్షేమాలు అడిగితెలుసుకున్నారు. ధర్మవరం గ్రామానికి చెందిన యువకుడు పల్లా అప్పలరాజు ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురికావడంతో అతన్ని పరామర్శించి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. గుండె ఆపరేషన్ అనంతరం విశ్రాంతిలో ఉన్న టీడీపీ సీనియర్ నేత కలిగట్ల సూర్యనారాయణను కూడా పరామర్శించారు. ఈ సందర్భంగా హోం మంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ,గత ప్రభుత్వ హయాంలో సర్పంచ్‌లకు అధికారాలు లేవని, ధర్మవరంలో ఒక్క రోడ్డు కూడా వేయలేదన్నారు. చాలా వరకు పాఠశాలలు శిథిలావస్థలో ఉన్నాయన్నారు. పాయకరావుపేట నియోజకవర్గంలో స్టీల్ ప్లాంట్, టాయ్ పరిశ్రమల ద్వారా ఉద్యోగాలు రానున్నాయని తెలిపారు. ధర్మవరం గ్రామాన్ని అభివృద్ధి చేస్తామని మంత్రి అనిత స్పష్టం చేశారు.

ఎర్రయ్య కుటుంబాన్ని ఆదుకోవాలి

- మత్స్యకారుల వినతి

నక్కపల్లి:అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం మండలం పూడిమాడక గ్రామానికి చెందిన మృతుడు చోడిపల్లి ఎర్రయ్య కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరుతూ హోం మంత్రి వంగలపూడి అనితకు శనివారం మత్స్యకార నాయకులు వినతి పత్రం అందజేశారు. మత్స్యకారుడు చోడిపల్లి ఎర్రయ్య తోటి మత్స్యకారులతో కలిసి సముద్రంలో వేట చేసే సమయంలో ఎర్రయ్య బోటు పై నుండి సముద్రంలో జారి పడిపోయాడని, గాలింపు చేపట్టినప్పటికీ ఆచూకీ నేటికీ లభించలేదన్నారు. ఎర్రయ్య కుటుంబానికి ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని, మరణ ధ్రువీకరణ పత్రం ఇప్పించాలని మత్స్యకార నాయకులు హోంమంత్రిని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో మత్స్యకార నాయకులు బొంది కాశీ విశ్వనాథం, గోసల తాతారావు, కారే కృష్ణ, పిక్కి రాంబాబు, గరికిన సింహాద్రి, వాసుపల్లి అడివిరాజు, వాసుపల్లి శివ, సిరిపల్లి అప్పలరాజు, కారే ధనరాజు ఉన్నారు.